ప్రజాశక్తి
ఆదివారం 27 అక్టోబర్ 2024 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

కొండేపల్లిలో

ఎల్లమ్మ గుడికి తాళం



ఎల్లమ్మ గుడికి తాళం వేసిన దృశ్యం

రాజకీయ వివాదమే కారణం

ప్రజాశక్తి-మార్కాపురం


రాజకీయ కక్షలకు ఆలయాలు కూడా అతీతం కాదని నిరూపించారు మార్కాపురం మండలంలోని కొండేపల్లిలో రాజకీయ నేతలు.. మండలంలోని కొండేపల్లి గ్రామం గతంలో కాంగ్రెస్ కంచుకోటగా ఉంది. ప్రస్తుతం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కంచుకోటగా ఉంది. ఆ గ్రామానికి చెందిన కె.పి.కొండారెడ్డి కాంగ్రెస్ పార్టీలో నాలుగు పర్యాయాలు మార్కాపురం ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తరువాత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున కెపి తనయుడు కుందురు నాగార్జునరెడ్డి 2019-24 వరకు మార్కాపురం ఎమ్మెల్యేగా పనిచేశారు. ఆ గ్రామ ప్రజలకు కొండారెడ్డి మాట వేదం. పెద్దాయన కూడా ఆ గ్రామ ప్రజలపై అంతే అభిమానం చూపేవారు. కాలానుగుణంగా వ్యక్తుల మధ్య సఖ్యత కుదరలేదు. కొద్ది మంది టిడిపికి అనుకూలంగా ఉన్నారు. ఈ క్రమంలో దేవుని ఉత్సవాలకు రాజకీయ రంగు పులుముకుంది.

కొండేపల్లి గ్రామంలో ఎల్లమ్మ ఆలయం ఉంది. ఆలయాన్ని వాల్మీకి కులంలోని పర్శినేని వంశస్తులు నిర్మించుకున్నారు. ఆలయం పాడుబడి పోవడంతో నూతనంగా నిర్మించారు. పర్శినేని వంశస్తులు ఎల్లమ్మ గుడికి అవసరమైన ఖర్చు భరించారు. నూతన గుడికి గత ఏడాది ఎల్లమ్మ కొలుపులు పెట్టుకున్నారు. గుడికి ఎంపిక చేసిన పెద్ద మనుషుల్లో పర్శినేని శ్రీను ఒకరు. అతను టిడిపి వర్గంలో కొనసాగుతున్నారు. మెజార్టీ జనం వైసిపిలో ▶ 2లో

మెడికల్ కళాశాల

నిర్మాణం నిలిచింది..!

- పునాదుల దశలోనే బాపట్ల వైద్య కళాశాల..
- కూటమి ప్రభుత్వంలో అయినా పూర్తయ్యేనా ?



నిలిచిపోయిన బాపట్ల మెడికల్ కాలేజి భవన నిర్మాణ పనులు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా


గడిచిన మూడేళ్లుగా అరకొరగా సాగిన బాపట్ల మెడికల్ కాలేజి భవన నిర్మాణాలు కూటమి ప్రభుత్వంలో పూర్తిగా నిలిచిపోయాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అప్పటివరకు అరకొరగా పనులు చేస్తున్న మేఘా నిర్మాణ సంస్థ మొత్తంగా సర్దుకొని ఇక్కడి నుంచి వెళ్లిపోయింది. గత వైసిపి ప్రభుత్వ హయాంలో జిల్లా కేంద్రమైన బాపట్లలో 500 పడకల ఆసుపత్రి, వైద్య కళాశాల భవనాల నిర్మాణాలకు రూ.550 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించడం జరిగింది. ఈ మేరకు పట్టణం నుంచి జమ్ములపాలెం వెళ్లే రోడ్డులో 55 ఎకరాలను కేటాయించారు. 2021 మేలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. వైద్య కళాశాల ఏర్పాటులో భాగంగా 500 పడకలతో బోధనాసుపత్రి, విద్యార్థులకు వసతిగృహ భవనాలు, నర్సింగ్ కళాశాల భవనాలు, తరగతి గదులు, మెస్, క్యాంటీన్‌ల నిర్మాణాలు జరుపుతామన్నారు. ముందుగా ప్రకటించిన ప్రకారం అయితే 2023 డిసెంబర్ నాటికే వైద్య కళాశాల, బోధనాసుపత్రి భవన నిర్మాణాలు పూర్తి చేసి 2025-26 విద్యాసంవత్సరం నుంచి బాపట్ల వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ తరగతులు ప్రారంభించాల్సి ఉంది. కానీ శంకుస్థాపన జరిగిన నాటి నుంచి భవన నిర్మాణాల కోసం నిధులు సక్రమంగా విడుదల కాకపోవడంతో గడిచిన మూడేళ్లుగా బాపట్ల వైద్యకళాశాల పనులు పునాది దశను మాత్రమే దాటాయి. ఇందుకోసం సేకరించిన స్థలం లోతట్టు ప్రదేశంలో ఉన్న నేపథ్యంలో మెరక చేసేందుకే చాలా సమయం పట్టింది. నత్తనడకన సాగిన ప్రధాన భవనం పనులు పునాదులు పూర్తయ్యి.. పిల్లర్ల దశలో ఉండిపోయాయి. గత ప్రభుత్వం ఎంత గొప్పగా చెప్పినా అందుకు అనుగుణంగా నిధులు విడుదల కాకపోవడంతో పనులు అరకొరగా సాగుతూ వచ్చాయి. మొదట్లోనే నాబార్డు రుణం మంజూరయినా రాష్ట్ర ప్రభుత్వం నుంచి సక్రమంగా నిధులు విడుదల కాకపోవడంతో పనులు మందకొడిగా సాగాయి. చేపట్టిన భవనాల్లో ఒక్కటి కూడా పిల్లర్ల దశ దాటిన పరిస్థితి లేదు. ఈ లోపు రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. నిర్మాణాలు ▶ 2లో



సభ్యత్వం నమోదు చేసుకున్న ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల, మేయర్ సుజాత

టిడిపి బలోపేతానికి సభ్యత్వ నమోదు

ఎమ్మెల్యే దామచర్ల, ఎంపీ మాగుంట ▶ 8లో



స్పింకర్ల పంపిణీ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి స్వామి

ట్రాఫిక్ నిబంధనలు

ఉల్లంఘిస్తే కఠినచర్యలు

- ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై స్పెషల్ డ్రైవ్
- 795 వాహనాలు తనిఖీ
- స్వయంగా పర్యవేక్షించిన ఎస్‌పి దామోదర్



ట్రాఫిక్‌ను పరిశీలిస్తున్న ఎస్‌పి దామోదర్



వాహనాల తనిఖీలో పోలీసులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్‌పి ఏఆర్ దామోదర్ హెచ్చరించారు. ట్రాఫిక్ నియమాలు పాటించాలని, రోడ్డుప్రమాదాల బారిన పడవద్దని సూచించారు. ప్రజల భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణే లక్ష్యంగా శనివారం ఒంగోలు నగరంలో పోలీసులు ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ప్రకాశం జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు ఒంగోలు నగర పరిధిలో 61 ప్రధాన ఏరియాలతో పాటు ముఖ్య కూడళ్ల వద్ద స్పెషల్ డ్రైవ్‌లో పోలీస్ అధికారులు, సిబ్బంది శనివారం ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ డ్రైవ్ లో ఇద్దరు అదనపు ఎస్‌పిలు, ఇద్దరు డిఎస్‌పిలు, 10 మంది సిఐలు, 40 మంది ఎస్సైలు సిబ్బంది మొత్తం ▶ 2లో

రైతు సంక్షేమమే ధ్యేయం

మంత్రి బాలవీరాంజనేయస్వామి

ప్రజాశక్తి-పొదిలి

రైతుల సంక్షేమమే సిఎం చంద్రబాబు నాయుడు ధ్యేయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలాశ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. మండల కేంద్రమైన మర్రిపూడి ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో ఏపీ.ఎమ్.ఐపి శాఖ ఆధ్వర్యంలో డ్రిప్పు మరియు స్పింకర్లు పంపిణీ కార్యక్రమం శనివారం జరిగింది. అనంతరం జరిగిన సభలో మంత్రి ముఖ్యఅతిథిగా మాట్లాడారు. మైక్రో ప్రాజెక్టు పథకం ద్వారా జిల్లాలో 33 కోట్లా 11 లక్షలా 70 వేల రూపాయలు రైతులకు రాయితీ కింద నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ పథకం ద్వారా జిల్లాలో 77 హెక్టార్ల భూమికి రైతులకి డ్రిప్పు మరియు స్పింకర్లు పంపిణీ చేశామన్నారు. కొండపి నియోజకవర్గంలో 124 మంది రైతులకు 94 లక్షలా 41 వేలు రాయితీ ఇవ్వడం జరిగిందన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఒక్క కోటీ 18 లక్షలు నిధులు ఖర్చు చేసినట్లు వివరించారు. జిల్లా ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ పివి రమణ మాట్లాడుతూ డ్రిప్పు మరియు స్ప్రింకర్లను కావలసిన రైతులందరికీ అందజేస్తామన్నారు. ఆన్‌లైన్ పేమెంట్ ద్వారా అర్హత కలిగిన రైతులందరూ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సభ్యులు తుళ్లూరి నరసింహారావు, మాజీ ఏఎంసీ చైర్మన్ యర్రమోతు శ్రీనివాసులు, టిడిపి మండల కన్వీనర్ సిహెచ్ నర్సారెడ్డి, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి వీరనారాయణ పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల నిర్మాణం నిలిచింది.!

(మొదటిపేజీ తరువాయి)

చేపట్టిన మేఘా నిర్మాణ సంస్థకు కూటమి ప్రభుత్వంలో మెడికల్ కళాశాల భవన నిర్మాణాల కొనసాగింపు కాంట్రాక్టు దక్కే అవకాశం లేకపోవడంతో ఇక్కడి నుంచి సర్దేసింది. కాగా కొత్త ప్రభుత్వంలో వైద్య కళాశాల పనులపై సమీక్ష జరగాలి. నిధులు విడుదల కావాల్సి ఉంది. కానీ కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాల భవన నిర్మాణాలను ఉన్నవి ఉన్నట్లుగా నిలిపివేస్తూ నిర్ణయం తీసుకుంది. పలు రాష్ట్రాల్లో నూతనంగా అమలు చేస్తున్నట్లు ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో మెడికల్ కళాశాలను నడపాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కొత్తగా టెండర్లు పిలిచి కాంట్రాక్టు సంస్థను ఎంపిక చేయాల్సి ఉంది. నూతన ప్రభుత్వ హయాంలో అయినా త్వరితంగా టెండర్లు పిలిచి సంస్థను ఎంపిక చేస్తే భవన నిర్మాణాలు మొదలుపెట్టవచ్చు. ఇప్పటినుంచి పనులు వేగంగా చేసినా భవనాల నిర్మాణాలు పూర్తయ్యేందుకు కనీసం మరో రెండేళ్లయినా పడుతుంది. బోధనాసుపత్రిని కనీసం రెండేళ్లు నిర్వహిస్తే ఎంబిబిఎస్ సీట్ల కోసం నేషనల్ మెడికల్ కమిషన్‌కు దరఖాస్తు చేసుకునే వీలు కలుగుతుంది. 2026-27 నాటికి అయినా ఎంబిబిఎస్ తరగతులు ప్రారంభ అయ్యేలా చర్యలు తీసుకోవచ్చు. జిల్లా కేంద్రమయిన బాపట్లలో వైద్య కళాశాల విషయమై జిల్లాలోని ప్రజాప్రతినిధులు, మంత్రులు చొరవ తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కొండేపల్లిలో ఎల్లమ్మ గుడికి తాళం

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నారు. గుడి విషయంలో, కొలుపుల విషయంలో వచ్చిన తేడాలతో రాజకీయంగా పర్శినేని వంశస్తులు రెండు గ్రూపులుగా విడిపోయారు. గత ఏడాదిలో జరిగిన కొలుపుల్లో పర్శినేని శ్రీను అనే వ్యక్తి కొన్ని ఆంక్షలు పెట్టినట్లు తెలిసింది. ఆంక్షలతో ఆలయంలో వేడుక జరపలేమని పోలీసుల చొరవతో అప్పట్లో వైసిపి వర్గంలో ఉన్న పర్శినేని వంశస్తులు కొలుపుతో పాటు నూతన ఆలయ ఉత్సవం జరిపారు. అప్పటి వేడుకల్లో టిడిపి వర్గం పాల్గొనలేదు. ఆ ఉత్సవం జరిగి ఏడాది కావస్తోంది. వచ్చే నెల 3న వార్షికోత్సవ వేడుక జరపాలని నిర్ణయించుకున్నారు. టిడిపి వర్గంలోని పర్శినేని వెంకటస్వామి అనే వ్యక్తితో పాటు పలువురు దీన్ని అంగీకరించలేదు. మీ ప్రభుత్వంలో మీరు ఉత్సవం చేసుకున్నారు.. ఇప్పుడు తమ టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉందని, తామే ఉత్సవం జరుపుకుంటామని ఏకంగా ఎల్లమ్మ గుడికి తాళం వేశారు.. దీంతో గ్రామంలో ఘర్షణలు జరిగే అవకాశం ఉందని మార్కాపురం రూరల్ పోలీసులు నిఘా పెట్టారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

500 మంది పాల్గొన్నారు. సరైన లైసెన్స్/రిజిస్ట్రేషన్/పత్రాలు లేని, ఇన్సూరెన్సు, మాడిఫైడ్ సైలెన్సర్లు, మైనర్ డ్రైవింగ్, త్రిపుల్ రైడింగ్, ఇన్సూరెన్సు, నెంబర్ ప్లేట్లు లేని/అనధికార నంబర్ ప్లేట్లు ఉన్న 795 వాహనాలను తనిఖీ చేసి పలు వాహనాలకు చలానా సీజ్ చేశారు. 45 ఆటోలు పట్టుకున్నారు. 900 బైకులకు నెంబర్ కనిపించే విధంగా బైక్‌లకు ప్లేట్లను ఏర్పాటు చేయించారు. ఈ డ్రైవ్‌లో రెండు దొంగ బైకులను పట్టుకున్నారు. స్పెషల్ డ్రైవ్ జరుగుతున్న సమయంలో అద్దంకి బస్టాండ్ సెంటర్, కొత్తపట్నం బస్టాండ్ సెంటర్, చర్చి సెంటర్, మామిడిపాలెం మంగమూరు జంక్షన్ ప్రాంతాల్లో ఎస్‌పి స్వయంగా పర్యటించి ఎన్‌ఫోర్స్‌మెంట్ తీరు ట్రాఫిక్ సమస్యలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. తనిఖీల్లో ఏఎస్‌పి (అడ్మిన్)కె నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్‌పి అశోక్ బాబు, ఒంగోలు డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, ఎఆర్ డిఎస్‌పి చంద్రశేఖర్, ట్రాఫిక్ సీఐ పాండు రంగారావు, ఒంగోలు తాలూకా సిఐ అజయ్‌కుమార్, వన్ టౌన్ సిఐ నాగరాజు, టు టౌన్ సిఐ ఎం.శ్రీనివాసరావు, ఒంగోలు రూరల్ సిఐ శ్రీకాంత్ బాబు, ఒంగోలు సబ్ డివిజన్ సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



బాలికలకు ప్రవేశం లేని నూతన టాయిలెట్లు

టాయిలెట్ సౌకర్యం లేక బాలికల ఇక్కట్లు

ప్రజాశక్తి-తాళ్లూరు

తాళ్లూరు మండలంలోని బొద్దికూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు ఫేజ్-1 పథకం ద్వారా సుమారు రూ.25 లక్షలతో బాల బాలికల సౌకర్యార్థం అధునాతన సౌకర్యాలతో టాయిలెట్స్, వాటర్ ట్యాంకు 3 సంవత్సరాల క్రితం నిర్మించారు. అయితే కొత్తగా నిర్మించిన టాయిలెట్స్‌ను బాలికలకు ఇవ్వకుండా ఉపాధ్యాయులు మాత్రమే ఉపయోగించుకునేందుకు వీలు కల్పిస్తున్నారు. పాఠశాలలో చదువుకునే 400 మంది విద్యార్థులలో సుమారు 200 మందికి పైగా ఉన్న బాలికలు పాఠశాల వెనకవైపు ఉన్న పాత, పాడుబడిన టాయిలెట్స్‌ను ఉపయోగిస్తున్నారు. పాత టాయిలెట్స్ అంతా పాములు, బల్లులు, కప్పలు, బొద్దింకలతో భయానకంగా ఉంటాయి. గడ్డి పెరిగి, పగిలిపోయిన పాత పెంకులు, పాత సామాన్లు, పగిలిపోయిన కొళాయిలతో, పాచిపట్టిన తొట్టి నీళ్లతో దుర్వాసన కొడుతూ ఉంటాయి. అటువంటి పాతటాయిలెట్స్‌లోకి బాలికలు వెళ్లాలి అంటే భయపడుతూ అసౌకర్యానికి గురవుతున్నారు. అధునాతనమైన సౌకర్యాలతో నిర్మించిన నాడు-నేడు కొత్త టాయిలెట్లను బాలికలు ఉపయోగించుకునే విధంగా చూడాలని, పాత టాయిలెట్స్‌ను శుభ్రం చేయాలని బాల బాలికలు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రీ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

గ్రామాల్లోని రైతులు రీ సర్వే ద్వారా ఇబ్బందులను తొలగించేందుకు ప్రభుత్వం ప్రత్యేక సదస్సులను ఏర్పాటు చేసిందని తహశీల్దార్ బి దిలీప్‌కుమార్ అన్నారు. మండలంలోని నల్లగండ్ల గ్రామంలో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. రైతుల నుంచి భూమి కొలతలు, పట్టాదారు పాసు పుస్తకం కోసం, పేరు సవరణ కోసం 11 అర్జీలు వచ్చినట్లు తెలియజేశారు. అర్జీలు స్వీకరించిన అనంతరం దిలీప్‌కుమార్ మాట్లాడుతూ సమస్యలు త్వరలోనే పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ కిషోర్ కుమార్‌రెడ్డి, మండల సర్వేయర్ కాకర్ల రమణయ్య, గ్రామ సర్వేయర్ పులి బ్రహ్మం, వీఆర్వో కాశయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.



రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న దిలీప్ కుమార్

ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి పట్టణంలోని దొరువు బజార్లో ఉన్న అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపాలిటీ తరఫున అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ తెలిపారు. శనివారం పట్టణంలోని కొండ కింద కొలువైన దేవి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ పరిసర ప్రాం తాలు చెట్లు పెరిగి, వ్యర్థాలతో నిండి ఉండడంతో మున్సిపల్ సిబ్బందితో శుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకున్నారు. మున్సిపాలిటీ తరఫున ఆలయానికి ఎటువంటి సహాయ సహకారాలు అందించాలన్నా తాము సిద్ధంగా ఉంటామని అన్నారు.

అవినీతి ఆరోపణలపై విచారణ జరిపించాలి: యుటిఎఫ్

ప్రజాశక్తి-కురిచేడు

కురిచేడు మండల విద్యాశాఖాధికారులపై అనేక అవినీతి ఆరోపణలతో అజ్ఞాత వ్యక్తి ఒకరు ముద్రించిన కరపత్రాలపై విచారణ జరపాలని యుటిఎఫ్ డిమాండ్ చేసింది. మండలంలో పనిచేసే ఉపాధ్యాయులను ఇద్దరు ఎంఈవోలు బెదిరిస్తూ, డబ్బులు వసూలు చేస్తున్నట్లుగా ఆ కరపత్రంలో ఉంది. వెంటనే విచారణ జరిపి ఆ అధికారులపై చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ కురిచేడు మండల శాఖ అధ్యక్షులు అన్నెం శ్రీనివాసరెడ్డి, గౌరవ అధ్యక్షులు షేక్ ఖాదర్ వలి, రాష్ట్ర కౌన్సిలర్ కోటేశ్వరరావు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ఆర్ శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాసరావు, కోశాధికారి కె పూర్ణచంద్రరావు, ఉపాధ్యక్షులు కె జాన్‌బాబు కోరారు.

అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I. A. NO: 2167/2022
I. A. NO: 2168/2022
I. A. NO: 2169/2022
O.S. NO: 360/2016

Between:
కురిచేటి నాగేంద్రమ్మ ...వాది/ పిటిషనరు
Vs
1) అద్దంకి ఏడుకొండలు (డైడ్)వగైరాలు ...ప్రతి వాదులు / రెస్పాండెంట్స్

TO,
R - 2: 1) అద్దంకి లక్ష్మీ W/o ఏడుకొండలు, తిమ్మాయపాలెం గ్రామం, అద్దంకి మండలం, బాపట్ల జిల్లా.
R - 3: 2) అలుగుల సుబ్బాయమ్మ W/o సుబ్రహ్మణ్యం, R/o పాదర్తి గ్రామం, కొత్తపట్నం మండలం, ప్రకాశం జిల్లా.
R- 4: 3) పొదిలి మల్లేశ్వరి W/o వెంకటేశ్వర్లు, R/o తిమ్మాయపాలెం గ్రామం, అద్దంకి మండలం, బాపట్ల జిల్లా.
R- 5: 4) నరసాపురం రాధిక W/o రవి, R/o రవ్వవరం గ్రామం, నూజెండ్ల మండలం, గుంటూరు జిల్లా.

పై తెలిపిన దావాలో మీ రెస్పాండెంట్స్ నెంబర్ 2 **to** 5 అయి ఉన్నారు. వారసుల పిటీషనులో కోర్టు వారు పలు పర్యాయములు నోటీసుల ద్వారా తెలియజేసియున్నారు. కానీ మీరు సమాధాన పరచనందున ఈ పత్రికా ప్రకటన ద్వారా 28.10.2024 వ తేదిన ఉదయం 10.30.ని॥ లకు మీరు గాని, మీ తరపున వకీలు కానీ శ్రీ కోర్టుకు హాజరు కావలసినది. లేనియెడల మీ పరోక్షముగా తెలియజేయుదురని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

వాయిదా తేది 28.10.2024

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
గుడాల అంజిరెడ్డి
పిటీషనర్స్ తరపున న్యాయవాది, అద్దంకి.

ఒంగోలు 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No. 360/2023

స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, సంతపేట బ్రాంచ్, ఒంగోలు ...వాది
Vs.
కత్తి సంధ్య రాణి, ప్రొప్రైటర్ చైతన్య ఆక్వా ఇండస్ట్రీస్, etc., ...ప్రతివాదులు
To.
D2: చందవోలు వెంకటేశ్వర రావు, S/o. రామకోటేశ్వరరావు, కో-ఆపరేటివ్ రిజిస్ట్రార్, నాటు బాబురావు పార్కు దగ్గర, సంతపేట, ఒంగోలు, ప్రకాశం జిల్లా.

వాది దావా పరిహారములు రాబట్టుకొను నిమిత్తం మీపై పై నంబరున దావా చేయగా నోటీసు నిమిత్తం తేది: 5.11.2024 ఉదయం గం॥ 10:30 ని॥లకు వాయిదా ఉన్నందున మీరు స్వయముగా కానీ లేక వకీలు ద్వారా కానీ పై కోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకొనని యెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.

// కోర్టు వారి అనుమతితో //

ఒంగోలు **ఇట్లు**
తేది: 17.10.2024 **ముదివర్తి రాఘవరావు,**
పెళ్లూరి వసుంధర,
అడ్వకేట్స్, సీతారాంపురం, ఒంగోలు,
ఫోన్: +91 9490952792

ఒంగోలు 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No. 498/2020

స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, మెయిన్ బ్రాంచ్, ఒంగోలు ...వాది
Vs.
రామదాసు సంజీవ కుమార్ ...ప్రతివాది
To.
రామదాసు సంజీవ కుమార్, Son of చిన్నయ్య, D.No. 1-1-25(4), మామిడిపాలెం, ఒంగోలు, ప్రకాశం జిల్లా.

వాది దావా పరిహారములు రాబట్టుకొను నిమిత్తం మీపై పై నంబరున దావా చేయగా నోటీసు నిమిత్తం తేది: 18.11.2024 ఉదయం గం॥ 10:30 ని॥లకు వాయిదా ఉన్నందున మీరు స్వయముగా కానీ లేక వకీలు ద్వారా కానీ పై కోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకొనని యెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.

// కోర్టు వారి అనుమతితో //

ఒంగోలు **ఇట్లు**
తేది: 17.10.2024 **ముదివర్తి రాఘవరావు,**
పెళ్లూరి వసుంధర,
అడ్వకేట్స్, సీతారాంపురం, ఒంగోలు,
ఫోన్: +91 9490952792

మహారాజశ్రీ మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఐ.పి. నెం: 53/2023

కొగటం రామలింగయ్య ...పిటీషనర్
వర్సెస్
1.రావిపాటి ప్రసాద్ మరియు ఇతరులు ...రెస్పాండెంట్లు

టు,
ఆర్-8: ఇదంకంటి నారాయణ, తండ్రి: నరసింహులు, నివాసం: ట్రైలర్ కాలనీ, బేస్తవారిపేట గ్రామం మరియు మండలం, ప్రకాశం జిల్లా.
ఆర్-9: కోతపులి రంగస్వామి, తండ్రి: రంగయ్య నివాసం: నరవ గ్రామం, గిద్దలూరు మండలం, ప్రకాశం జిల్లా.

పిటీషనర్ మీ పైన పై నెంబరు ఐ.పి.ని పై కోర్టు నందు కేసు దాఖలు చేసి ఉన్నందున ఆ కేసులో మీకు శ్రీ కోర్టు వారు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ మీకు చేరనందున మీ హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు తేదీ: 04-11-2024కి వాయిదా వేసి ఉన్నారు. కావున సదరు తేదీన ఉదయం 10:30 గంటలకు మీరు స్వయముగా గానీ, లేదా లాయరు గారి ద్వారా గానీ శ్రీ కోర్టు వారి ముందు హాజరై పై కేసులో మీ అభ్యంతరములు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వులతో //

వాయిదా: 04-11-2024

జి.ఎన్.నవీన్ కుమార్
అడ్వకేట్, మార్కాపురం
సెల్: 9000450215.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

ఒంగోలులో రాష్ట్ర డెంటల్ కాన్ఫరెన్స్ ప్రారంభం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. శనివారం ఒంగోలులోని సాయి ఐటిఎ కన్వెన్షన్‌లో నిర్వహించిన 43వ రాష్ట్ర డెంటల్ కాన్ఫరెన్స్ సమావేశంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి డాక్టర్ డిబివి స్వామికి వైద్యులు ఘన స్వాగతం పలికారు. తొలుత సాయి ఐటిఎ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన దంత వైద్య పరికరాలు, ఎక్విప్‌మెంట్స్ స్టాల్‌ను మంత్రి సందర్శించారు. అనంతరం సదస్సును ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి దంత వైద్యుల సమావేశం ఒంగోలులో నిర్వహించడం అభినందనీయమన్నారు. గతంలో దంత డాక్టర్లు అతి తక్కువ మందే ఉండేవారని, నేడు ఎక్కువ మంది వివిధ రకాల స్పెషలైజేషన్స్ చేసి ప్రజలకు వైద్య సేవలు అందించడం సంతోషదాయకమన్నారు. ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావు మాట్లాడుతూ ఒంగోలులో దంత వైద్యుల రాష్ట్ర సదస్సు జరపటం ఆనందంగా ఉందన్నారు. ప్రకాశం జిల్లా వైద్య సేవలలో మెడికల్ హబ్‌గా మారుతుందన్నారు. గుంటూరు, విజయవాడ, బెంగళూరు, చెన్నైలలో లభించే వైద్య సేవలు జిల్లాలో అందుబాటులోకి రావటం సంతోషంగా ఉందన్నారు. దంత వైద్యుల రాష్ట్ర స్థాయి సదస్సు విజయవంతం కావాలని, నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి, రాష్ట్ర స్థాయి డెంటల్ కాన్ఫరెన్స్ నిర్వాహకులు డాక్టర్ నామినేని కిరణ్ కుమార్, డాక్టర్ శ్రీధర్ బాబు, డాక్టర్ సుధాకర్ రాజు డాక్టర్ రామచంద్ర రెడ్డి, రాష్ట్రవ్యాప్తంగా దంత వైద్యులు పాల్గొన్నారు.



డెంటల్ కాన్ఫరెన్స్‌ను ప్రారంభిస్తున్న మంత్రి స్వామి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

బైక్‌ను వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ సంఘటన యర్రగొండపాలెం సమీపంలో జరిగింది. అందిన వివరాల మేరకు.. యర్రగొండపాలెం పట్టణానికి చెందిన షేక్ నూర్ మహ్మద్(29), మొగల్ అఫ్రోజ్(21) మోటార్ సైకిల్‌పై 565 జాతీయ రహదారిపై యర్రగొండపాలెం సమీపంలోని అనకుంట దగ్గర పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ కొట్టించుకునేందుకు శనివారం రాత్రి వెళ్లారు. మాజీ మంత్రి సురేష్ గెస్ట్‌హౌస్ దాటిన తర్వాత వెళ్తున్న మోటార్ సైకిల్‌ను ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. దీంతో వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. వారిద్దరికీ ఇంకా వివాహం కాలేదు. ఇరువురు సరదాగా పెట్రోల్ కొట్టించుకునేందుకు వెళ్ళి మృత్యుఒడికి చేరడంతో విషయం యర్రగొండపాలెం పట్టణంలో దావానలంగా వ్యాపించింది. దీంతో ఆ రెండు కుటుంబాలతో పాటు యర్రగొండపాలెంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



మృతి చెందిన నూర్ అహ్మద్, అఫ్రోజ్

నేడు తర్లుపాడు హైస్కూలు వజ్రోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-తర్లుపాడు

తర్లుపాడు ఉన్నత పాఠశాల వజ్రోత్సవ వేడుకలకు సిద్ధమైంది. ఈ పాఠశాలను 1949లో స్థల దాతలు నేరెళ్ల కుటుంబీకుల సహకారంతో పాఠశాలను నిర్మించారు. పాఠశాల నిర్మించి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వజ్రోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ప్రధానోపాధ్యాయులు ముత్తోజు సుధాకర్, ఉపాధ్యాయ బృందం శ్రీకారం చుట్టారు. పాఠశాలలో 75 సంవత్సరాలుగా చదివిన పూర్వపు విద్యార్థుల ద్వారా రూ. 50 లక్షల విరాళాలతో పాఠశాల అభివృద్ధి చేపట్టారు. కార్పొరేట్ సంస్థల కంటే దీటుగా విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులతో పాఠశాలకు మెరుగులు దిద్దారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా మంత్రి స్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పాల్గొంటారని, సుమారు పదివేల మంది పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు.



బాలికతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

తాత్కాలిక ప్రాతిపదికన బాలిక దత్తత

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆశ్రయం పొందుతున్న రామకోటమ్మ (7) అనే బాలికను చీరాల ప్రాంతానికి చెందిన మహిళ సుజినికి తాత్కాలిక ప్రాతిపదికన కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా శనివారం దత్తత ఇచ్చారు. సుజిని చీరాల న్యాయస్థానంలో క్లర్క్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం ప్రకాశం భవనంలో జరిగిన కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కె.మాధురి, డిసిపిఒ దినేష్ కుమార్ పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం పట్టివేత

ప్రజాశక్తి-కంభం రూరల్

కంభం పట్టణంలోని ఓ ప్రైవేటు సంస్థలో రికవరీ ఏజెంట్ గా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉన్న గోవా మద్యాన్ని ఎక్సైజ్ శాఖ అధికారులు శనివారం పట్టుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 50 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ డి.బాలయ్య తెలిపారు. తక్కువ ధరకే గోవా నుంచి మద్యం దిగుమతి చేసుకుని స్థానికంగా అమ్మేందుకు ప్రయత్నిస్తున్నట్లుగా తెలిపారు. ఈ దాడుల్లో కంభం సిఐ ఎస్.కొండారెడ్డి, కంభం, మార్కాపురం ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య మద్యం షాపు వద్దంటూ నిరసన

దుకాణం ఏర్పాటును అడ్డుకున్న కాలనీవాసులు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మా ఇళ్ల మధ్యలో మద్యం షాపు ఏర్పాటు చేయవద్దంటూ మండలంలోని ఉప్పుగుండూరులోని ఎస్టీ కాలనీ, పురుషోత్తం కాలనీవాసులు శనివారం రాత్రి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం నూతన మద్యం పాలసీ క్రింద టెండరు దక్కించుకున్న నిర్వాహకులు షాపు నెంబరు 26ను తొలుత ఉప్పుగుండూరులోని గంగమ్మ సెంటరులో ఏర్పాటు చేశారు. అక్కడ దేవాలయాలు, పాఠశాల, హెల్త్ సెంటరు దగ్గరలో ఉండటంతో మహిళలు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆ పరిసర వాసులు మహిళలు నిరసన తెలిపారు. దీంతో ఆ షాపును మట్టిగుంట రోడ్డులో ఎస్‌టి కాలనీ, పురుషోత్తం కాలనీ ఆనుకొని ఉన్న ప్రాంతంలో ఏర్పాటు చేస్తుండగా ఆ కాలనీ వాసులు మహిళలు అధిక సంఖ్యలో అక్కడకు చేరుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ మద్యం షాపు మా ఇళ్ల మధ్య ఉంటే అర్ధరాత్రి వరకు మందుబాబులు వీరంగంతో మా కుటుంబాలు ఎలా బ్రతకాలని నిలదీశారు. మీరంతా హాయిగా ఉండాలి.. మా కుటుంబాలు మాత్రం ఎలా పోయినా పర్వాలేదా? అని ప్రశ్నించారు. ఏది ఏమైనా ఆ షాపు ఇక్కడ కొనసాగనివ్వమని, సరుకును ఆటోకు ఎత్తేవరకు ఇక్కడనే బైటాయిస్తామని మహిళలు భీష్మించుకొని కూర్చున్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ బి.శ్రీకాంత్ సంఘటనా స్థలానికి చేరుకొని ఎక్సైజ్ అధికారులతో ఫోన్లో మాట్లాడారు. సమస్యను పరిష్కరిస్తామని ఆందోళనకారులకు తెలిపారు. కొంచెం వ్యవధి ఇవ్వాలని కోరారు. అయినప్పటికీ సరుకు తీసేవరకు ఇక్కడనుండి వెళ్లమని ఆందోళకారులు తెలిపారు.



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీకాంత్



ఆయుధాల గురించి వివరిస్తున్న ఎస్పీ

'ఓపెన్ హౌస్'తో విద్యార్థులకు విజ్ఞానం

ప్రజా శక్తి - బాపట్ల జిల్లా

"ఓపెన్ హౌస్" లాంటి కార్యక్రమాల వలన విద్యార్థులకు విజ్ఞానం పెంపొందుతుందని బాపట్ల జిల్లా అడిషనల్ ఎస్పీ టి.పి. విఠలేశ్వర్ అన్నారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహించే స్మారకోత్సవాలలో భాగంగా శనివారం బాపట్ల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ ఆవరణలో "ఓపెన్ హౌస్" (పోలీస్ శాఖ వినియోగించే పరికరాల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది తమ విధి నిర్వహణలో ఉపయోగించే ఆయుధాలు, వివిధ పరికరాలు వాటి పనితీరు, సాంకేతిక సాధనలను గురించి, వేలిముద్రలు సేకరించు పరికరాలు వాటి ఉపయోగాల గురించి సంబంధిత అధికారులు విద్యార్థులకు వివరించారు. పోలీసుల విధులు, వారు వాడే ఆయుధాలు, పరికరాలు, బాధ్యతలు, శాంతిభద్ర నిర్వహణ తదితర అంశాలను విద్యార్థి దశలోనే తెలుసుకోడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. బాపట్ల జిల్లాలోని పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థిని, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, ఎస్బీ సిఐ నారాయణ, అడ్మిన్ ఆర్.ఐ మౌలుద్దీన్, వెల్ఫేర్ ఆర్.ఐ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం

ప్రజాశక్తి-టంగుటూరు

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించాల్సిన సమావేశం సాదాసీదాగా జరిగింది. టంగుటూరు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ పటాపంజుల కోటేశ్వరమ్మ గైర్హాజరయ్యారు. అమెతో పాటుగా ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు సగానికి పైగా హాజరు కాలేదు. దీంతో వైస్ ఎంపీపీ దగ్గుమాటి సుమన్ రెడ్డి అధ్యక్షతన సమావేశాన్ని ఎంపీడీవో దేవసేన కుమారి నిర్వహించారు. సర్వసభ్య సమావేశం ఉదయం 10:30కి ప్రారంభించాల్సి ఉండగా 11.50కి ప్రారంభించారు. మధ్యాహ్నం 1.30కే ముగించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్దామంటే సగానికి పైగా అధికారులు హాజరు కాకపోవడంతో సమస్యలు ఎవరు పరిష్కరిస్తారో చెప్పాలంటూ పలువురు ప్రజాప్రతినిధులు ప్రశ్నించారు. అనంతరం, వెలగపూడి గ్రామాలకు సరఫరా అయ్యే నీటి పైపులు మరమ్మతులకు గురయితే ఒక్క అధికారి స్పందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తహశీల్దార్ కార్యాలయం నుంచి బొమ్మల కూడలి వరకు రోడ్డు నిర్మించాలని, ఆక్రమణల తొలగింపుతో ఏమిటి లాభం అని ఎంపీటీసీ దాసు ప్రశ్నించారు. టంగుటూరు ఎస్సీ కాలనీకి నీరు సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు సైడు కాలువలు పొంగి నివాస గృహాలలోకి నీరు వచ్చి చేరిందన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం సరిగా నిర్వహించడం లేదని, అంటు వ్యాధులు, జ్వరాలు అధికంగా ఉన్నాయని అధికారుల ముందు తమ గోడు వెళ్లపోసుకున్నారు. సమావేశం మొక్కుబడిగా జరిగిందని, అధికారులు గైర్హాజరయితే సమస్యల పరిష్కారం ఎలా అని పలువురు ప్రశ్నించారు. టీ, బిస్కెట్‌ల కోసం నిర్వహించారని పెదవి విరిచారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

ప్రజాశక్తి-పెద్దారవీడు

మండలంలోని ఏనుగులదిన్నెపాడు గ్రామానికి చెదిన అచ్చమ్మ (60) విద్యుత్ షాక్‌తో శనివారం మృతి చెందారు. అందిన వివరాల ప్రకారం.. ఇంట్లో దుస్తులు ఆరేస్తుండగా ఇంటి పక్కనే ఉన్న ఆవరణలో రేకుల పైపుకు విద్యుత్ సరఫరా కావడం, ఆ పైపును ఆమె ప్రమాదవశాత్తు తగలడంతో విద్యుత్ షాక్‌కి గురై అక్కడికక్కడే అచ్చమ్మ కుప్పకూలింది. విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. పెద్దారవీడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆమెకు ముగ్గురు కుమారులు ఉన్నారు.

ఎంపీ మాగుంటను కలిసిన గుంటూరు ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డిని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం ఒంగోలు టిడిపి కార్యాలయంలో ఎంపీకి ఎమ్మెల్యే గల్లా మాధవి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా వారు ఇరువులు పలు విషయాలు చర్చించుకున్నారు. అదేవిధంగా ఎంపీని ఇరిగేషన్ విభాగం సూపరింటెండింగ్ ఇంజినీర్ వరలక్ష్మి, బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు రాంనగర్ 2వ లైన్‌లోని ఎంపి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అధికారులకు ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి అభినందనలు తెలియజేశారు.



ఎంపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాధవి

విద్యుత్ భారాలపై మాట తప్పిన ప్రభుత్వం

ట్రూ అప్ చార్జీ రద్దు చేయాలన్న సిపిఎం పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్

ప్రజాశక్తి - రేపల్లె

రూ.6072కోట్ల విద్యుత్ ట్రూ అప్ చార్జీల భారం ప్రజలపై మోపుతూ ఇచ్చినా ఆదేశాలు రద్దు చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్‌లి డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలోఆయన మాట్లాడారు. విద్యుత్ భారా లపై కూటమి ప్రభుత్వం మాట తప్పిందని ఆరోపించారు. గత వైసిపి ప్రభుత్వం అదనపు ధరకు విద్యుత్ కోనుగులు సాకుతో ప్రజల నెత్తిన భారం మోపినా కూటమి సర్కార్ వైసిపి ప్రభుత్వ దారిలోనే బాదుడు ప్రారంభించిందని అన్నారు. విద్యుత్ నియంత్రణ మండలి ప్రతిపాదనలు చేసి న రూ.6072 సర్దుబాటు చార్జీలు నవంబర్ నుండి వసూలు చేయాలాని అనుకోవటం దుర్మార్గం అన్నారు. నాలుగు నెలల్లో సూపర్ సిక్స్, ఇతర హామీలు అమలుచేయకుండా కాలయాపన చేస్తున్న కూటమి ప్రభుత్వం ప్రజలను బాదడంలో ముందుందని ఆరోపించారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, భారాలు తగ్గిస్తామని మాట ఇచ్చిన తెలుగు దేశం కూటమి వాగ్దాన భంగానికి పాల్పడిందని అన్నారు. రూ.6072కోట్ల సర్దుబాటు చార్జీలతోపాటు మరో రూ.11 వేల కోట్లపైగా భారం మోపటానికి సిద్ధమవుతున్నదని అన్నారు. విద్యుత్,


సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు సిహెచ్ మణిలాల్

ఇతర రూపాల్లో ప్రజల నెత్తిన భారాలు మోపిన వైసిపిని ప్రజలు గద్దె దించారని గుర్తు చేశారు. తెలుగుదేశం, బిజెపి, జనసేన కూటమి ప్రభుత్వం కూడా భారాలు మోపే దారిలోనే ప్రయాణిస్తే ప్రజలను మోసం చేయటమే అవుతుందని అన్నారు. బడా కంపెనీలకు దోచి పెట్టి భారీ ఎత్తున అవినీతికి పాల్పడిన గత వైసిపి ప్రభు త్వం అక్రమాలపై విచారణ చేసి శిక్షించాల్సింది పోయి ఆ భారాలకు తెలుగుదేశం కూటమి ఆమోదముద్రవేసి ప్రజల పై 2022 -23లో వినియోగించుకున్న విద్యుత్తుకు నేడు ఒక్కొక్క యూనిట్‌కు అదనంగా 85పైసలు 2024 నవంబర్ నుండి 2026 జనవరి వరకు 15 నెలల పాటు వసూలు చేయాలని నిర్ణయించడం అక్రమం అన్నారు. ఒక్కొక్క యూనిట్‌కు అన్నిరకాల సర్దుబాటు చార్జీలు కలిసి రూ.2 వరకు వసూలు చేయటం దారుణం అన్నారు. అస లు చార్జీల కంటే కొసరు చార్జీలు అధికం అవుతున్నాయని అన్నారు. 2000లో ప్రపంచ బ్యాంకు ఆదేశాలతో ప్రజా వ్యతిరేక విద్యుత్ సంస్కరణలు ప్రవేశపెట్టి ప్రజల ఆగ్రహానికి అప్పట్లో తెలుగుదేశం ప్రభుత్వం గురైందని అన్నారు. వైసిపి భారాలపై ప్రజల ఆగ్రహంతో ఓడిపోయిందని అన్నారు. గుణ పాఠాలు నేర్చుకోకుండా చంద్రబాబు ప్రభు త్వం విద్యుత్ నియంత్రణ మండలి పేరుతో ప్రజలను పీల్చుకునే ప్రయత్నం చేస్తుందని అన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే విద్యుత్ నియంత్రణ మండలి మోపిన భారాన్ని ప్రభుత్వమే భరించాలని కోరారు. ప్రజలకు ఉపశమనం కలిగించాలని అన్నారు. ఇళ్లకు స్మార్ట్ మీటర్లు, వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు పెట్టడం ఆపాలని అన్నారు. మోడీ ప్రభుత్వ ఆదేశాలకు లొంగి అదాని, ఇతర కార్పొరేట్ కంపెనీలకు మేలు చేయటానికి విద్యుత్ సంస్కరణల పేరుతో ప్రమాదకర విధానాలను కొనసాగిస్తే కూటమి ప్రభుత్వంపై ప్రజల ఆశలు కనుమరుగవుతాయని అన్నారు. ఇప్పటికైనా పునరాలోచించి విద్యుత్ బారాలు ఆపాలని కోరారు. సమావేశంలో సిపిఎం నేతలు కెవి లక్ష్మణరావు, జె ధర్మరాజు, డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


రుణాలపై అవగాహన కల్పిస్తున్న ఎపిజిబి అధికారులు

ఎపిజిబి సేవలపై నృత్యప్రదర్శన

ప్రజాశక్తి - బల్లికురవ

నాబార్డు సౌజన్యంతో మండలంలోని వైద్యన గ్రామంలో శనివారం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు అందిస్తున్నసేవలను నృత్య రూపకంలో ఖాతాదారులకు అవగాహన కల్పించారు. బ్యాంకు ఖాతాదారులకు సేవలు అందిస్తున్న విషయాలను వివరించారు. ప్రభుత్వ రాయితీలు, ఖాతాదారులు వినియోగించుకోవాల్సిన పథకాలను వివరించారు. అతి తక్కువ వడ్డీకి రైతులకు వ్యవసాయ రుణాలు అందిస్తున్నట్లు బ్యాంకు కొప్పెరపాడు మేనేజర్ వాసు తెలిపారు. సామాజిక బద్రత, పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు, వివిధ వృత్తుల వారికి అందిస్తున్న సబ్సిడీ పథకాలను వివరించారు. కార్యక్రమంలో బ్యాంకు క్షేత్రస్థాయి అధికారి ఎలీషా, వైదన బిజినెస్ కరస్పాండెంట్ ఎస్ సుబ్బారావు పాల్గొన్నారు.


యోగ పోటీలకు ఎంపికైన కొల్లూరు విద్యార్థి వంశీధర్

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - కొల్లూరు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా తాడికొండ మండలం రావిల పాఠశాల్లో అండర్ 17 యోగ విభాగంలో యోగ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని శ్రీ సాయి వాసవి విద్యా సంస్థ నుండి బోయిన వంశీధర్ రాష్ట్రస్థాయి యోగ పోటీలకు ఎంపికైనట్లు స్కూలు డైరెక్టర్ శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యా సంస్థ డైరెక్టర్ శ్రీనివాసరావు పాఠశాల రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయులు గుమ్మడి రామ్మోహనరావు, ఉపాధ్యాయులు లావణ్య యోగాకు ఎంపికైన విద్యార్థి వంశీధర్‌ను అభినందించారు.


పోటీలకు హాజరైన విద్యార్థులు

విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి - రేపల్లె

భాష్యం పాఠశాల నందు యాక్సిస్ బ్యాంక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు పార్వహించారు. డ్రాయింగ్, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్, క్రియేటివ్ రేటింగ్‌లో నిర్వహించిన ఆటలు పోటీల్లో అధిక సంఖ్యలో విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. యాక్సిస్ బ్యాంక్ మార్కెటింగ్ మేనేజర్ ఉదయ్ ఆధ్వర్యంలో ఆటలు పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఏడేళ్ల నుండి పదేళ్ల విద్యార్థులకు ధి గ్రేట్ ఫుల్ హార్ట్ అంశంపై, 11ఏళ్ల నుండి 14ఏళ్ల విద్యార్థులకు ధి ఉంసంగ్ హీరోస్ అనే అంశాలపై పోటీ నిర్వహించామని తెలిపారు. పాఠనాల ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఇటువంటి పోటీలు విద్యారుల్లో సృజనాత్మకతను పెంపొందించటానికి దోహద పడతాయని అన్నారు. పోటీలు నిర్వహించిన యాక్సిస్ బ్యాంక్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. నవంబర్ 14 బాలల దినోత్సవం రోజు విజేతలను ప్రకటించనున్నట్లు తెలిపారు.

ఉద్యమాలతోనే ప్రజాసమస్యల పరిష్కారం

ప్రజాశక్తి - అద్దంకి

ఉద్యమాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని, అలాంటి ఉద్యమాల రూపకల్పనకు సిపిఎం ప్రాంతీయ కమిటీ 12వ మహాసభలు నవంబర్ 10న జరగనున్నట్లు సిపిఎం కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక సుందరయ్య భవన్లో మహాసభల కరపత్రంను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలకు భిన్నంగా సిపిఎం క్రింద స్థాయి కమిటీల నుండి జాతీయ స్థాయి కమిటీల వరకు ప్రతి మూడేళ్లకు ఒకసారి మహాసభల ద్వారా ఎన్నుకుంటుందని తెలిపారు. అందులో భాగంగా నవంబర్ 10న అద్దంకి ప్రాంతీయ కమిటీ మహాసభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గడిచిన మూడేళ్లలో గ్రామ స్థాయి నుండి మండల స్థాయి వరకు వివిధ వృత్తులు, వ్యవసాయం, రాజకీయ రంగంలో వచ్చిన మార్పులు, ప్రజలు ఎదుర్కొనే సమస్యలను చర్చించి రాబోయే మూడేళ్లలో వాటి పరిష్కారానికి తగిన ఆందోళన కార్యక్రమం రూపొందించనున్నట్లు తెలిపారు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో మారిన ప్రభుత్వ విధానాలను చర్చించి ప్రత్యామ్నాయం ప్రజా విధానాలు రూపొందిస్తామని తెలిపారు. దానికి అనుగుణంగా ప్రజా ఉద్యమాలు


సిపిఎం కరపత్రం ఆవిష్కరిస్తున్న తంగిరాల వెంకటేశ్వర్లు

నిర్మాణం గురించి చర్చించనున్నట్లు తెలిపారు. రాబోయే మూడేళ్ల ఉద్యమాన్ని నడిపేందుకు నూతన కమిటీని ఈ మహాసభ ఎన్నుకోనున్నట్లు తెలిపారు. ఈ మహాసభ జయప్రదం కోసం ప్రజలు సంపూర్ణ సహకారాలు అందించాలని కోరారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సిపిఎం జాతీయ కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి సంస్మరణ సభ ఆదివారం సాయంత్రం 4గంటలకు సుందరయ్య భవన్లో జరుగుతుందని సిపిఎం నాయకులు డి గంగాధర్ తెలిపారు. సిపిఎం సభ్యులు, సానుభూతిపరులు, అభిమానులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె రఘుచంద్, బి విజయకుమార్ పాల్గొన్నారు.

ఐ కేర్‌లో దీపావళికి ప్రత్యేక సేవలు

ప్రజాశక్తి - రేపల్లె


కిషోర్ బాబు

గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన కంటి వైద్య సేవలు అందించేందుకు ఫోకస్ ఐ కేర్ హాస్పిటల్ ప్రత్యేక సేవలు అందిస్తున్నట్లు హాస్పిటల్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి కిషోర్ బాబు తెలిపారు. దీపావళి సందర్భంగా తమ హాస్పిటల్ నందు 50ఏళ్ల పైబడిన వారికి ఉచిత కంటి పరీక్షలు చేయడంతోపాటు 50శాతం రాయితీతో కళ్లజోళ్లు ఇస్తున్నట్లు తెలిపారు. కంటి ఆపరేషన్లపై 50శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. రూ.30వేలు ఖరీదయ్యే కంటి ఆపరేషన్ కేవలం రూ.15వేలకే చేస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన కంటి వైద్యం అందించేటందుకు, నివారించదగిన అంధత్వాన్ని తొలగించే ఉద్దేశ్యంతో ఈ సేవలు ప్రారంభించామని అన్నారు. కంటి శుక్లాలను ఆపరేషన్ ద్వారా తొలగించేందుకు అధునాతన పరికరాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఫ్యాకో పరికరం ద్వారా శుక్లాలను కంటి నొప్పి, కుట్టు, కట్టు, కోత లేకుండా లేజర్ ద్వారా కంప్యూటర్ వద్దతిలో చేయవచ్చని తెలిపారు.

ప్రతి దాన్నీ రాజకీయం చేస్తే మూల్యం తప్పదు

◆ పులి శ్రీను మృతి కేసుపై పోలీసులను సమన్వయం చేస్తున్నాను ◆ ప్రజలు వాస్తవాలను అర్థం చేసుకోవాలి

ప్రజాశక్తి - చీరాల

పాపాయిపాలెంకు చెందిన పులి శ్రీను మృతి కేసుపై వైసిపి వాళ్ళు ధర్నా చేస్తుంటే ఆ ధర్నాకు తాను రాలేదని కొందరు మాట్లాడటం విడ్డురంగా ఉందని ఎంఎల్‌ఎ కొండయ్య పేర్కొన్నారు. వైసిపి ధర్నాలో తానెలా పాల్గొంటానని ప్రశ్నించారు. స్థానిక తెలుగుదేశం కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొద్ది రోజులు చీరాల్లో లేనని, అయినప్పటికి పులి శ్రీను మృతి కేసు విషయంపై పోలీసులు, ఉన్నత అధికారులతో మాట్లాడుతు ప్రత్యేక దృష్టి పెట్టానని అన్నారు. కేసులో దోషులెవరో తెలియకుండా పోలీసులు ఎవరిని శిక్షిస్తారని ప్రశ్నించారు. పులి శ్రీను ఎలా మరణించారనే విషయంపై అందరికీ స్పష్టత రావాలంటే శవ పరీక్షలకు సంబంధించి నివేదిక రావాల్సి ఉన్నదని అన్నారు. అప్పటి వరకు సంయమనం పాటించాలని అన్నారు. మృతుడు శ్రీను ఇంటికి రెండు సార్లు తాను వెళ్ళి కుటుంబ సభ్యులతో మాట్లాడినట్లు తెలిపారు. తాను చీరాలకు వచ్చి రెండున్నరేండ్లు అవుతున్నప్పటికీ రాజకీయ హత్యలు


సమావేశం మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

ఎక్కడ లేవని అన్నారు. శ్రీను కేసు విషయం గురించి రిపోర్టులు వచ్చాక పోలీసులు అన్ని విషయాలు వెల్లడిస్తారని, అప్పటి వరకు వేచి ఉండాలని అన్నారు. అయితే ఉద్దేశపూర్వకంగా ఒకదానికొకటి సంబంధం లేకుండా కొందరు మాట్లాడుతున్నారని, పుకార్లు పుట్టిస్తున్నారని అన్నారు. శ్రీను కేసులో వాస్తవలు బయటకు వచ్చాక అసత్యాలు ప్రచారం చేసిన వాళ్ల మూల్యం చెల్లించుకోక తప్పదు అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం పరిశీలకులు నాతాని ఉమా మహేశ్వరరావు, ప్రజా వేదిక నాయకులు గుమ్మడి ఏసు రత్నం, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.


సర్టిఫికేట్లు అందజేస్తున్న డాక్టర్ దేవరాజు

నైపుణ్యం ఉంటేనే ఉపాధి

ప్రజాశక్తి - చీరాల

మండలంలోని ఈపురుపాలెం ఎస్‌కె బ్రహ్మానాయుడు ఐటిఐ కళాశాల నందు ఐటిఐ కోర్స్ పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికేట్ కాన్వకేషన్ శనివారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ ఎండి డాక్టర్ తాడివలస దేవరాజు, చీరాల మాజీ ఎంపిపి నాదెండ్ల కోటేశ్వరరావు హాజరై మాట్లాడారు. నైపుణ్యాన్ని పెంపొందించుకుంటే భవిష్యత్తు అద్భుతంగా తీర్చిదిద్దుకోవచ్చని చెప్పారు. వ్యక్తిత్వ వికాసానికి కావలసిన సూచనలు, సలహాలు అందజేశారు. పలువురు పారిశ్రామికవేత్తలు సాధించిన విజయాలను స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. పరీక్షకు హాజరైన 60 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు సత్తార్, కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌ఎ సత్తార్, అధ్యాపకులు కెవి శేషయ్య, శైలజ, జ్యోతి, జిలాని పాల్గొన్నారు.

వైసిపి నగర నాయకులతో బూచేపల్లి భేటీ

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్



వైసిపి నగర నేతలతో భేటీ అయిన బూచేపల్లి

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒంగోలు నగర నాయకులతో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో భేటీ అయ్యారు. కార్యకర్తల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని, అత్యవసరమైతే వెంటనే తనకు ఫోన్ చేయాలని చెప్పారు. అంతా కలిసికట్టుగా పని చేసి ఒంగోలు నగరంలో పార్టీని అభివృద్ధి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు జూపూడి ప్రభాకర్ రావు, బత్తుల బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర నాయకులు టీజేఆర్ సుధాకర్‌బాబు, జిల్లా నాయకులు దామరాజు క్రాంతికుమార్, పార్టీ ఒంగోలు నగర అధ్యక్షులు కటారి శంకర్, కార్పొరేటర్ ఇమ్రాన్‌ఖాన్, కొత్తపట్నం మండల నాయకులు లంకపోతు అంజిరెడ్డి, ఒంగోలు రూరల్ నాయకులు రాయపాటి అంకయ్య పాల్గొన్నారు.

సమతానగర్‌లో కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్



సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్

స్థానిక 38వ డివిజన్ సమతా నగర్ ప్రాంతంలో నగరపాలక సంస్థ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు శనివారం పర్యటించారు. ఆ ప్రాంతంలోని సమస్యలను స్థానిక కార్పొరేటర్ మలగా రమేష్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని కమిషనర్‌కు వివరించారు. మురుగు కాలువలు సక్రమంగా వెళ్లడం లేదని, కొన్నిచోట్ల పైప్ లైన్లు ఉన్న కాలువలు మార్పు చేసి వాటి స్థానంలో కల్వర్టులు కట్టాలని కోరారు. కర్నూల్‌రోడ్డు డ్రైనేజీ వర్షం వస్తే మునిగిపోయి నీరు రోడ్ల మీదకి వస్తుందని, కొన్నిచోట్ల ఆక్రమణలు ఉన్నాయని, వాటిని తొలగించాలని కోరారు. ఈ సమస్యలు మీద కమిషనర్ స్పందించారు. సమతానగర్ ప్రాంతంలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ ఇంజినీర్‌కు ఆదేశాలు జారీ చేశారు. టర్న్ కాకును పిలిపించి ఆయనతో మాట్లాడారు. నీటిని సకాలంలో వదలాలని ఆదేశించారు. కల్వర్ట్ల సమస్యలను గుర్తించి వెంటనే తనకు నివేదిక ఇవ్వాలని, అన్ని కాలువలు మార్కింగ్ చేయాలని ఇంజనీరింగ్ విభాగం సిబ్బందికి సూచించారు. కాల్వల మీద, కర్నూలు రోడ్ లో ఉన్న ఆక్రమణలు తొలగించాలని టౌన్ ప్లానింగ్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ డివిజన్లో అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఆయన వెంట కార్పొరేటర్ మలగా రమేష్, తెలుగుదేశం పార్టీ నాయకులు పగిడి రాములు, కార్పొరేషన్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం జడ్‌పి బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మునగాల చంద్రశేఖరరెడ్డి శనివారం తెలిపారు. కందుకూరులోని టిఆర్ఆర్ కళాశాల మైదానంలో శుక్రవారం జరిగిన అండర్-17 బాలుర అథ్లెటిక్ పోటీలలో తొమ్మిదో తరగతి విద్యార్థి ఇ.చిరంజీవి పాల్గొన్నారు. 110 మీటర్ల హడిల్స్‌లో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచారు. దీంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని వివరించారు. ఆ పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో చిరంజీవిని అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.జాహ్నవి ప్రియ, చెన్నకృష్ణ, ఉపాధ్యాయులు జీఎల్ రమేష్‌బాబు, కొండయ్య, సమీవుల్లా, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వెంకట్రావు జీవితం

కార్మికుల అభ్యున్నతికి అంకితం

- ఆయన ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి
- ఐఎల్‌టిడి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు



మాట్లాడుతున్న ఐఎల్‌టిడి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు

ప్రజాశక్తి-చీరాల

ఐటిసి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 50 సంవత్సరాల సుదీర్ఘ జీవితాన్ని కార్మికుల అభ్యున్నతికి అంకితం చేసిన ఐఎల్‌టిడి ఏపీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు వాసంశెట్టి వెంకట్రావు ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి అని ఐఎల్‌టిడి ఏపీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఏవి.నాగేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక ఐఎల్‌టిడి కంపెనీ వద్ద ఫెడరేషన్ ఆధ్వర్యంలో కామ్రేడ్ వెంకట్రావు సంతాప సభ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సభకు ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి పారాన్ కాలేషా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి మాట్లాడుతూ వెంకట్రావు ఆశయ సాధనకు కార్మికులందరూ కృషి చేయాలన్నారు. రాబోయే అగ్రిమెంటు కార్మికులకు విశ్వాసం కలిగించేలా, కార్మిక వర్గానికి అనుకూలంగా అగ్రిమెంట్ చేయడమే కామ్రేడ్ వెంకట్రావుకు అర్పించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. అనంతరం సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ 1973లో ఐఎల్‌టిడి వర్కర్‌గా చేరి దశలవారీగా కార్మికుల న్యాయమైన డిమాండ్లపై పోరాడుతూ అగ్రిమెంట్ల ద్వారా మంచి జీతభత్యాలు వచ్చేలా వెంకట్రావు కృషి చేశారని చెప్పారు. కార్మికుల సమస్యలపై నాటి నుండి నేటి వరకు కూడా అలుపెరగని కృషి చేసిన మహనీయులన్నారు. కార్మికుల పక్షాన వారి అభివృద్ధి ఆకాంక్షిస్తూ ఐటీసీలో రెండు పర్యాయాలు అగ్రిమెంట్లు చేసి వారి కోసం పాటు పడ్డారని చెప్పారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిఐటియు బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్.మజుందర్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గంగయ్య, చీరాల కార్యదర్శి ఎం వసంతరావు, అధ్యక్షులు ఎన్.బాబూరావు, కొండయ్య, ఐఎల్‌టిడి మేనేజ్మెంట్ చీరాల కంపెనీ జనరల్ మేనేజర్ శ్యామ్‌సుందర్, పర్సనల్ మేనేజర్ విజయలక్ష్మి, సేఫ్టీ మేనేజర్ ఎం.ఎస్ నారాయణరెడ్డి, టెక్నీషియన్స్ జనరల్ సెక్రటరీ జీవీ సత్యనారాయణ, స్టాఫ్ జనరల్ సెక్రటరీ సుధాకర్‌రెడ్డి, అనపర్తి నుండి బ్రాంచ్ అధ్యక్షులు సూర్యనారాయణ, కార్యదర్శి శామ్యూల్ రాజు, రాజమండ్రి నుంచి ప్రసాద్, చీరాల బ్రాంచ్ నుండి అధ్యక్షులు బోయిన పోతురాజు, కార్యదర్శి గంట సుధీర్, నక్కల సాంబశివరావు, సుధా, శివరాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

నగరంలోని జెడ్‌పి కాలనీ, జర్నలిస్టు కాలనీ, కొత్త డొంక, శివప్రసాద్ కాలనీ, మంగమూర్ రోడ్డు, గాంధీ నగర్, ప్రగతి కాలనీ, హరిహర నగర్ తదితర ప్రాంతాలలో ఉదయం ఏడు గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఉంటుందని ఒంగోలు టౌన్ డిఈఈ కె.వి.పాండురంగారావు తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

- నగరంలోని కమ్మ పాలెం, గోపాల్ నగర్, ఇందిర్తి నగర్, ట్రంక్ రోడ్ తదితర ప్రాంతాలలో ఉదయం ఏడు గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ మరమ్మత్తుల కారణంగా విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఉంటుందని డిఇఇ తెలియజేశారు.

సిద్ధయ్యకు విఎస్ఆర్ పరామర్శ

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్



సిద్ధయ్యను పరామర్శిస్తున్న వి.శ్రీనివాసరావు

ఇటీవల మోకాలు ఆపరేషన్ చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు, పార్టీ సీనియర్ నాయకులు వై సిద్ధయ్యను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శనివారం పరామర్శించారు. స్థానిక సత్యనారాయణపురంలోని సిద్ధయ్య నివాసానికి వెళ్లి ఆరోగ్య విషయాలను ఆరా తీశారు. సిద్ధయ్య త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అంద్రా మాల్యాద్రి కూడా సిద్ధయ్యను పరామర్శించారు.

డ్రైనేజీలపై ఆక్రమణలు తొలగింపు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్



పరిశీలిస్తున్న మేయర్ సుజాత

నగరంలోని అద్దంకి బస్టాండ్, పరిసర ప్రాంతాల్లో కాల్వల మీద ఉన్న ఆక్రమణలను నగరపాలకసంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు శనివారం తొలగించారు. ఈ కార్యక్రమాన్ని మేయర్ గంగాడ సుజాత పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మురుగు కాల్వల ఆక్రమణ వల్ల మురుగు సాఫీగా వెళ్లడం లేదని, వర్షపు నీరు సక్రమంగా వెళ్ళడం లేదని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం లారీ పట్టివేత

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం నియోజకవర్గంలో రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. మితిమీరిన రేషన్ దందా కొనసాగుతుంది. రేషన్ షాపులపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. కార్డుదారుల నుంచి కేజీ రేషన్ బియ్యం రూ.10కు కొనుగోలు చేసి వాటిని ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తూ కేజీకి రూ.25 చొప్పున విక్రయించుకుంటున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే యర్రగొండపాలెం పంచాయితీ పరిధిలోని సాయిబాబా నగర్‌లో రేషన్ షాపుల నుంచి అక్రమంగా కొనుగోలు చేసిన 572 బస్తాల రేషన్ బియ్యాన్ని శనివారం తెల్లవారుజామున రహస్యంగా ఒక లారీలో లోడ్ చేసి ఇతర ప్రాంతానికి తరలిస్తున్నారనే సమాచారం తెలియడంతో మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్, రెవెన్యూ, పోలీస్ సిబ్బందితో కలిసి స్వయంగా దాడులు నిర్వహించారు. రేషన్ బియ్యంతో ఉన్న లారీని స్వాధీనం చేసుకున్నారు. విషయం తెలుసుకున్న లారీ సిబ్బంది, రేషన్ మాఫియా, కూలీలు అక్కడి నుంచి జారుకున్నారు. లారీలోని బియ్యాన్ని త్రిపురాంతకం గూడెంకు తరలించి భద్రపరిచారు. లారీని యర్రగొండపాలెం పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు ప్రారంభం

ప్రజాశక్తి-కొండపి

కొండపిలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంత్రి డాక్టర్ డోలాశ్రీ బాల వీరాంజనేయస్వామి ప్రారంభించారు. శనివారం కొండపిలోని టిడిపి కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ దేశంలోని రాజకీయ పార్టీల్లో కార్యకర్తల సంక్షేమం కోసం బీమా ప్రవేశపెట్టింది తెలుగుదేశమే అన్నారు. మంత్రి నారా లోకేష్ ఆలోచనల నుంచి పురుడు పోసుకున్నదే కార్యకర్తల ప్రమాద బీమా పథకం అన్నారు. కార్యకర్తలకు ప్రమాద బీమా రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచటం జరిగిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ



మార్కాపురంలో మాట్లాడుతున్న కందుల




మాట్లాడుతున్న మంత్రి స్వామి

చైర్మన్ జి రామయ్య చౌదరి, క్లస్టర్ నాయకులు వసంతరావు, భూధవాటి సోమయ్య, చింతల వెంకటరావు పాల్గొన్నారు.

మార్కాపురం: తెలుగుదేశం పార్టీ బలం కార్యకర్తలేనని, వారి సంక్షేమమే తెలుగుదేశం పార్టీ ధ్యేయమని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. మొదటగా కందుల నారాయణరెడ్డి సభ్యత్వాన్ని రెన్యూవల్ చేయించుకున్నారు. కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, 33వ వార్డు కౌన్సిలర్ నాలి కొండయ్య, టిడిపి నాయకులు మాలపాటి వెంకటరెడ్డి, కొప్పుల వెంకటేశ్వర్లు, మర్రి కొండలు, తాళ్లపల్లి వెంకటసత్యనారాయణ పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: రూ.వంద చెల్లించి రూ.ఐదు లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని పొందాలని టిడిపి యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. శనివారం యర్రగొండపాలెం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ నేపథ్యంలో గూడూరి ఎరిక్షన్‌బాబుతో పాటు పలువురు రూ.లక్ష చొప్పున చెల్లించి.. శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సభ్యత్వ కార్డు అందజేస్తున్న ఎరిక్షన్‌బాబు

తెలుగుదేశం సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా



తెలుగుదేశం సభ్యత్వం అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి



సభ్యత్వ నమోదు ప్రారంభించిన ఎంఎల్ఎ ఏలూరి

ప్రజాశక్తి- సంతమాగులూరు

తెలుగుదేశం సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ కార్యకర్తలను ఆదేశించారు. పుట్టావారిపాలెంలోని ఆయన అతిథి గృహం లో సభ్యత్వ నమోదు శనివారం ప్రారంభించారు. తాను రూ.ఒకలక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు. నూతన సభ్యత్వం విధానంలో రూ.100 చెల్లించి సభ్యత్వం చేసుకుంటే రూ.5లక్షల ప్రమాద భీమా వర్తిస్తుందన్నారు. అనంతరం వెల్లలచెరువు గ్రామానికి చెందిన మాజీ జడ్పిటిసి చింతా రామారావు సతీమణి చింతా శ్రీదేవి దశదిన కార్యక్రమంలో పాల్గొని ఆమె చిత్రపటానికి పూల దండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయన వెంట అద్దంకి మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచు గరటయ్య, ఎంపీపీ వై ఎలమంద, నాయకులు తేలప్రోలు రమేష్, చేవూరి వాసురెడ్డి, అట్లా చిన్న వెంకటరెడ్డి, అట్లా పెద్ద వెంకటరెడ్డి, బొల్లినేని రామకృష్ణ పాల్గొన్నారు.

మార్టూరు రూరల్ : తెలుగుదేశం సభ్యత్వం కార్యకర్తలకు కొండంత భరోసా అని, కార్యకర్తల సంక్షేమం తెలుగుదేశంతోనే సాధ్యమని శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. తన క్యాంప్ కార్యాలయంలో సభ్యత్వ నమోదును ఆయన శనివారం ప్రారంభించారు. రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వాన్ని ఆయన తీసుకున్నారు.

బాపట్ల : మండలంలోని జమ్ములపాలెం గ్రామంలో తెలుగుదేశం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు శనివారం ప్రారంభించారు. తొలుత తానే శాశ్వత సభ్యత్వం తీసుకున్నట్లు ప్రకటించారు. నియోజకవర్గ పరిశీలకులు బొంతు శివసాంబిరెడ్డి, బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు సలగల రాజశేఖర్ బాబు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాతా జయప్రకాష్ నారాయణ, తెలుగుదేశం మండల అధ్యక్షులు ముక్కామల సాంబశివరావు, గ్రామ అధ్యక్షులు కరణం యజ్ఞేశ్వరరావు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చీరాల : తెలుగుదేశం సభ్యత్వంతో ప్రజలకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని ఎంఎల్ఎ కొండయ్య అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన తొలి సభ్యత్వత్వం టిడిపి రాష్ట్ర కార్యదర్శి నాతని ఉమా మహేశ్వరరావు చేతుల మీదగా అందుకున్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు డేటా నాగేశ్వరావు, గుమ్మడి ఏసురత్నం, పిక్కి నారాయణ పాల్గొన్నారు.

రేపల్లె : తెలుగుదేశం విజయానికి అహర్నిశలు కష్టపడి పనిచేసిన కార్యకర్తలే కుటుంబ సభ్యులని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక తెలుగుదేశం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అనగానే శివప్రసాద్, రాష్ట్ర కార్యనిర్వాహక కర్యదర్శి పంతాన్ని మురళీధరరావు, జివి నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు జిపి రామారావు, సుబ్రమణ్యం, యార్లగడ్డ ధర్మతేజ పాల్గొన్నారు.

పర్చూరు : గ్రామంలో సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని తెలుగుదేశం మండల అధ్యక్షుడు షంషుద్దీన్, తెలుగుదేశం నాయకులు శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ప్రారంభించారు.

కారంచేడు : తెలుగుదేశం సభ్యత నమోదు కార్యక్రమం గ్రామంలో టిడిపి సీనియర్ నాయకులు యార్లగడ్డ అక్కయ్య చౌదరి ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. కార్యక్రమం కంభంపాటి నరేంద్ర, పాతూరి ఆదిలక్ష్మి, యార్లగడ్డ వీరయ్య చౌదరి, ఎస్కె కాలేశా, పాతూరు శివరాం ప్రసాద్ పాల్గొన్నారు.

కొల్లూరు : తెలుగుదేశం కార్యాలయంలో టిడిపి మండల అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ శనివారం కార్యకర్తలతో కలిసి సభ్యత్వ నమోదు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్టిఎస్ కో ఆర్డినేటర్ గద్దె సతీష్, పెదపూడి నాగరాజు, ఎడ్ల శ్రీనివాస్, నాగుల శరత్, గొరిగిపూడి ప్రసాద్, బుర్రె జగన్ పాల్గొన్నారు.

వేమూరు : రాష్ట్రంలో ప్రతి కుటుంబం సంక్షేమాన్ని పొందటానికి టిడిపి సభ్యత్వాన్ని పొందాలని శాసన సభ్యులు నక్కా ఆనందబాబు కోరారు. స్థానిక తెలుగుదేశం కార్యాలయంలో సభ్యత్వ నమోదు శనివారం ప్రారంభించారు.



శాశ్వత సభ్యత్వం తీసుకున్న ఎంఎల్ఎ వేగేశన నరేంద్రవర్మ



సభ్యత్వం తీసుకుంటున్న ఎంఎల్ఎ కొండయ్య



మాట్లాడుతున్న శాసన సభ్యులు ఆనందబాబు



సమావేశంలో మంత్రి సోదరులు అనగాని శివప్రసాద్

పట్టభద్రుల ఓటు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - రేపల్లె

కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టబద్రుల ఎంఎల్సి ఎన్నికలకు పట్టభద్రులందరూ ఓటుకు ధరఖాస్తు చేసుకోవాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరులు శివప్రసాద్ కోరారు. పట్టణంలోని ఎబిఆర్ డిగ్రీ, ప్రభుత్వ జూనియర్, పాలిటెక్నిక్ కళాశాలలో ఉపాధ్యాయులకు ఎంఎల్సి ఎన్నికలకు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ కృష్ణ, గుంటూరు జిల్లాల ఉమ్మడి అభ్యర్థిగా మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంపిక చేశారని తెలిపారు. నవంబర్ 6వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. గత ఎన్నికల జాబితా లేదని, ప్రస్తుతం నూతనంగా దరఖాస్తు చేసుకోవాలనే విషయాన్ని ఓటర్లకు తెలియజేసి చైతన్యం చేయాలని కోరారు. యార్లగడ్డ ధర్మతేజ పాల్గొన్నారు.



రహదారి నిర్మాణ పనులు చేస్తున్న దృశ్యం

గురిజేపల్లి నుండి రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని గురిజేపల్లి గ్రామం నుండి ఈటి వరకు ఉన్న మూడు కిలోమీటర్ల రోడ్డు గుంతల మయంగా ఉండేది. వర్షం వస్తే అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి ఉండేది. ఈ రహదారిని ఆనుకుని గ్రానైట్ ఫ్యాక్టరీలు, గ్రానైట్ క్వారీలు ఉండటంతో నిత్యం గ్రానైట్ లోడుతో ట్రాలీలు తిరుగుతుంటాయి. అందువలన ఈ రహదారిపై మోకాళ్ళలోతు గుంతలు ఏర్పడ్డాయి. ఈ రహదారి గుండా కోటప్పకొండ, నరసరావుపేట, చిలకలూరిపేట వెళుతుంటారు. నిత్యం గురిజేపల్లి, చవిటిపాలెం, తంగేడుమల్లి గ్రామాల ప్రజలు ద్విచక్ర వాహనాలు, ఆటోలపై వెళుతుంటారు. ఈ రోడ్డుపై ప్రయాణం నరకయాతనగా ఉండేది. ఆటోలు, ద్విచక్ర వాహనాలపై ప్రయాణం చేసే ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల గురిజేపల్లి తెలుగుదేశం నాయకులు వేముల లక్ష్మయ్య, పలువురు నాయకులు మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి రోడ్డు పరిస్థితిని వివరించారు. దీంతో స్పందించిన మంత్రి వెంటనే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు.

నేడు ఏచూరి సంస్మరణ సభ

ప్రజాశక్తి - అద్దంకి

సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి సంస్మరణ సభ నేడు అనగా ఆదివారం స్థానిక అభ్యుదయ నగర్లోని సుందరయ్య భవన్లో సాయంత్రం 4గంటలకు జరుగుతుందని సిపిఎం అద్దంకి మండల కమిటీ తెలిపారు. సభకు సిపిఎం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ సిహెచ్ గంగయ్య హాజరవుతారని తెలిపారు.

నేడు రెడ్ల ఐక్య వేదిక సమావేశం

ప్రజాశక్తి - బాపట్ల

అఖిల భారత రెడ్ల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈనెల 27న బాపట్ల పట్టణంలోని ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో రెడ్ల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు అఖిల భారత రెడ్ల ఐక్య వేదిక కన్వీనర్ పట్నం సురేంద్రరెడ్డి శనివారం తెలిపారు. ఉపాధి పరంగా అభివృద్ధి చెందాల్సిన ఆవశ్యకతపై చర్చించి అనేక నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిపారు. సమావేశంలో అఖిల భారత రెడ్ల ఐక్య వేదిక కో కన్వీనర్ దొరకచెర్ల భరత్‌రెడ్డి, బండి దామోదరరెడ్డి, జానకి రామరెడ్డి, కంబాలచేను జితేంద్రరెడ్డి పాల్గొన్నారు.

జోరుగా మద్యం బెల్ట్‌షాపులు

- కుందేరు వద్ద షాపులో 24 గంటలు అమ్మకాలు
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలో ఐదు మద్యం షాపులకు ఆన్లైన్ టెండర్లను ప్రభుత్వం ఆహ్వానించింది. 5షాపులకు 80మంది టెండర్లు వేశారు. టెండర్ దక్కించుకున్న లబ్ధిదారులందరూ సిండికేట్‌కు తెరలేపారు. వేటపాలెం నుండి కుందేరు వెళ్లే రహదారి వెంట కుందేరు వద్ద ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద సిండికేట్‌గా టెండర్ తగ్గించుకున్న కొంతమంది ఒక్క గంట సమయం వృధా కాకుండా షాపు నెలకొల్పారు. రాత్రిం బవళ్లు తేడా లేకుండా 24 గంటలు మద్యం షాపు కొనసాగిస్తున్నారు. ఎప్పుడు కావాలంటే అప్పుడు షాపు వద్దకు వెళ్లి మద్యం కొనుగోలు చేస్తున్నారు. అర్ధరాత్రి వేళల్లో అధిక ధరకు విక్రయిస్తున్నారు. ఉదయం పూట ఆరు గంటలకే వాచ్మెన్‌ను నిద్రలేపి మద్యం కొనుగోలు చేస్తున్నారు. టెండర్లు దక్కించుకున్న దుకాణాదరులకు కేవలం 20 రోజుల తాత్కాలిక లైసెన్సులు మాత్రమే మంజూరు చేసింది. ఈ దుకాణాలను మండల స్థాయిలో ఎక్కడైనా పెట్టుకోవచ్చనే వ్యసులు బాటుతో విచ్చల విడిగా విక్రయాలు చేస్తున్నారు. తాత్కాలిక లైసెన్స్ పొందిన దుకాణాలపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మద్యం సిండికేట్లు పెచ్చరిల్లిపోతున్నారు. కుందేరు మద్యం దుకాణం ఆధ్వర్యంలో రావన్నపేట, వినాయకపురం, నాయనపల్లి, వేటపాలెం రైల్వే ట్రాక్ పడమర వైపు, సర్వోదయ కాలనీ, కటారిపాలెం, శారదా కాలనీల్లో మద్యం బెల్ట్ షాపులు జోరందుకున్నాయి. స్థానిక రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిలో యూనియన్ బ్యాంకు, ఎండోమెంట్ చెన్నకేశవ స్వామి దేవస్థానం, పెద్ద మసీదు, జెడ్‌పి హై స్కూల్, సాయి స్కూల్ కూతవేటు దూరంలో పర్మినెంట్ మద్య దకాణం ఏర్పాటు చేయడానికి పక్కా భవనాలు నిర్మిస్తున్నారు. ఈ భవన నిర్మాణం అక్రమంగా నిర్మిస్తున్నారని గత సోమవారం కలెక్టరేట్లో గ్రీవెన్స్ లో పరణం బాలాజీ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. ఎక్సైజ్ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు మిన్నకుండి పోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మద్యం షాపులను పర్యవేక్షించి అక్రమాలు అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రైతులకు సబ్సిడీ ధరకు శనగ విత్తనాలు

ప్రజాశక్తి - పర్చూరు



మాట్లాడుతున్న ఎడిఎ ఎన్ మోహనరావు

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీ ధరకు శనగ విత్తనాలను అందిస్తుందని ఎడిఎ ఎన్ మోహనరావు తెలిపారు. స్థానిక ఎఎంసి యార్డులో శనివారం జరిగిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం జెజి 11 శనగలు క్వింటా రూ.9,400 ఉండగా 25శాతం సబ్సిడీతో రైతులకు రూ.7050లకు, కాక్ 2 రకం ప్రస్తుత రూ.12వేలు ఉండగా సబ్సిడీ పోను రైతులకు రూ.9075లకు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు మేరిమ్మ, వేణుగోపాల్, సుధీర్ బాబు పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న డాక్టర్ ఐ బాబురావు

షూటింగ్ బాల్ పోటీల్లో బాపట్ల జిల్లా జట్టు ఘన విజయం

ప్రజాశక్తి - చీరాల

ఈనెల 19, 20, 21 తేదీల్లో అనంతపురంలోని శ్రీ నేతాజీ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు 43వ సీనియర్ బాల బాలికల రాష్ట్రస్థాయి షఉటింగ్ బాల్ పోటీలు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 15 జిల్లాల నుండి క్రీడాకారులు పాల్గొనగా విశాఖపట్నంపై బాపట్ల జిల్లా జట్టు 3-0 తేడాతో విజయం సాధించి 3వ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా స్థానిక ప్రేమ హార్ట్ హాస్పటల్ నందు జరిగిన అభినందన కార్యక్రమంలో హాస్పిటల్ అధినేత డాక్టర్ ఇస్తర్ల బాబురావు మాట్లాడుతూ బాపట్ల జిల్లా షఉటింగ్ బాల్ అసోసియేషన్ బాధ్యతలు తాను చేపట్టిన నుండి 5వ సారి విజయం సాధించడం తనకు ఎంతో గర్వంగా ఉందని అన్నారు. గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల విజయానికి శిక్షణ ఇచ్చిన కోచ్‌లు తుమ్మ శ్రీనివాసరెడ్డి, తుమ్మ బుచ్చిరెడ్డి, షఉటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి సురేంద్రను అభినందించారు. ఆటలు శారీరిక, మానసిక ఉల్లాసానికి ఎంతో అవసరమని అన్నారు. ఎప్పుడు తన వంతు సహాయం అందజేస్తానని తెలిపారు. గెలుపొందిన అనిల్, శివ, వినయ్, కార్తీక్, ఆనంద్, రామ్ చైతన్య అనిల్ కుమార్, రాజశేఖర్, శ్రీరామ్, రామ్ చరణ్, మురళి, చార్లెస్‌ను అభినందించారు.

సమయపాలన పాటించకుంటే కఠిన చర్యలు

ప్రజాశక్తి - చీరాల



ఎక్సైజ్ సిఐ నాగేశ్వరావు

మద్యం దుకాణ దారులు, భార్ షాపుల నిర్వాహకులు ఇకపై విధిగా సమయ పాలన పాటించాల్సిందే నని ఎక్సైజ్ సిఐ నాగేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతనంగా కేటాయించిన మద్యం దుకాణాదారులు ఈనెల 31లోపు ఆయా దుకాణాలను ఖచ్చితమైన స్థానాల్లో ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. బార్ షాపులు ఉదయం 11 నుంచి రాత్రి 11 గంటల వరకు, మద్యం దుకాణాలు ఉదయం 10 నుంచి 10లోపు మూసివే యాలని అన్నారు. మద్యం దుకాణాల వద్ద ఎటువంటి పర్మిట్ రూమ్సకు అనుమతి లేదని తెలిపారు. కేవలం మద్యం అమ్మకాలు మాత్రమే చేయాలన్నారు. దుకాణల వద్ద మాత్రం ఎట్టి పరిస్థితుల్లో మద్యం సేవించడానికి అనుమతి లేదన్నారు. ఎంఆర్పీ ధరలకే మద్యం అమ్మకాలు చేయాలన్నారు. బెల్ట్ దుకాణాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - వేమూరు



సోమరవుతు అనురాధ

మహిళా సంక్షేమమే ద్వేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగి స్తుందని జనసేన జిల్లా కార్యదర్శి సోమరౌతు అనురాధ తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దీపావళి నాటికి మహిళలకు ఉచిత గ్యాస్ అందించనున్నట్లు తెలిపారు. ఈనెల 29నుంచి ఉచిత గ్యాస్ కొరకు బుకింగ్స్ ప్రారంభమవుతాయని తెలిపారు. తెల్ల రేషన్ కార్డు ఉండి గ్యాస్ కనెక్షన్ కలిగిన ప్రతి మహిళ ఉచిత గ్యాస్కు బుకింగ్స్ చేసుకోవచ్చన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృ త్వంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా పనిచేస్తుందని అన్నారు. జనవరిలో తల్లికి వందనం ప్రారంభించనున్నట్లు తెలిపారు.



పోస్టర్ ఆవిష్కరిస్తునన డాక్టర్ భాగ్యారజ్

పశుగణన గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - కారంచేడు

పశుగణన గోడపత్రికను స్థానిక పశు వైద్యశాల డాక్టర్ భాగ్యరాజ్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల గణాంకాల సేకరణకు వచ్చే సిబ్బందికి పశుపోషకులు సహకరించాలని కోరారు. సమగ్ర సమాచారం ఇవ్వాలని కోరారు. మండలంలోని అన్ని గ్రామాలకు సూపర్ వైజర్లను నియమించామని అన్నారు. కార్యక్రమం వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వరకు నిర్వహిస్తామని తెలిపారు.

నేడు కామేపల్లిలో జాబ్‌మేళా

ప్రజాశక్తి - అద్దంకి

మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆధ్వర్యంలో ఎఎస్-ఎస్ఐఎస్టి సేవా సంస్థ సహకారంతో నాగులపాడు రోడ్డులోని కామేపల్లి కళ్యాణ మండపంలో నేడు జాబు మేళా నిర్వహించనున్నట్లు మంత్రి కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. తొలుత ఆర్ అండ్ బి బంగ్లాలో జాబ్ మేళా సన్నాహాలు చేసినప్పటికీ ఆ తర్వాత కామేపల్లికి మార్చినట్లు తెలిపారు. ఈ మార్పును అభ్యర్థులు గమనించాలని కోరారు.

సొసైటీకి స్వాధీనమైన అద్దేపల్లి గోడౌన్ స్థలం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఎట్టకేలకు భట్టిప్రోలు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి చెందిన అద్దేపల్లి మునుసుబు బజా ర్లోని గొడౌన్ స్థలం ఆక్రమణ దారుల చెర నుండి కోర్టు ఆదేశాలతో సొసైటీ పరమైంది. ఈ స్థలంలో అక్రమంగా నిర్మించిన కాంక్రీటు బెల్టును పిఎసిఎస్ అధికారులు జెసిబితో శనివారం తొలగించారు. 2023మే నెలలో ఈ స్థలంలోని శిథిలావస్థకు చేరిన గొడౌను సమీపంలో వైసీపీ నాయకులు ఆనాడు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా కూల్చివేసి దానిలోని సామాగ్రిని దోచుకు న్నారు. చుట్టుప్రక్కల ముస్లిం సోదరులను నమ్మించి ఈ స్థలంలో మదర్శ నిర్మాణాన్ని చేపడుతామని చందాలు వసూలు చేశారు. వాటితో మదర్శ నిర్మాణానికి బోర్లు వేసి కాంక్రీట్ బెల్టుకు నిర్మించారు. ఈ స్థలం సొసైటీకి సంబంధించినదేనని, ఆక్రమణ దారులు, భూ కబ్జాదారుల చెర నుండి అధికారులు విడిపించి సొసైటీకి అప్పగించా లనే భావనతో 'ప్రజాశక్తి' అనేకమార్లు కథనాలు ప్రచురిం చింది. ఈ కథనాలు ఆసరా చేసుకుని సమీపంలోని ప్రముఖ హైకోర్టు న్యాయవాది ఎంఎ రెహమాన్ ఈ స్థలం సొసైటీకి సంబంధించినదేనని, అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరుతూ లోకాయుక్త కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో రెవెన్యూ అధికారులు పరిశీలన జరిపి ఈ స్థలం సొసైటీకి సంబంధించినదేనని నిర్ధారిస్తూ తగిన నివేదికలను కోర్టుకు, అధికారులకు నివేదించారు. ఈ నివేదికలను అనుసరించి లోకాయుక్త కోర్టు కమిటీని ఏర్పాటు చేసి, పరిశీలన జరిపి స్థలాన్ని సొసైటీకి అప్పగించడంతో ఆనాడు స్థలానికి చుట్టుప్రక్కల ఇనుప కంచను ఏర్పాటు చేశారు. అంతటితో ఆగకుండా



మదర్సా పేరుతో నిర్మించిన కట్టడాన్ని తొలగిస్తున్న దృశ్యం

న్యాయవాది రెహమాన్ దానిలో అక్రమంగా నిర్మించిన బెల్టులను తొలగించాలని కోర్టు ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు శనివారం తొలగించక తప్పలేదు.

మాజీ మంత్రి నాగార్జున సహకారంతో కబ్జాకు యత్నం

మాజీ మంత్రి మెరుగు నాగార్జున ఆదేశాలతో స్థానిక వైసిపి నాయకులు సొసైటీకి చెందిన స్థలం భూ కబ్జాకు తెర లేపారని, తానున్నాను ఏదైనా చూసుకుంటానని నాగార్జున భరోసా ఇవ్వటంతో ఇంతకాలం సొసైటీకి చెందిన స్థలం అనేక అవస్థలకు గురికావాల్సి వచ్చిందని గ్రామస్తులు వ్యాఖ్యానిస్తున్నారు. సంబంధిత అధికారులు జోక్యం చేసుకోవద్దని నాగార్జున సూచించారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారులకు అన్ని విధాల తలనొప్పిగా మారింది. ఏది ఏమైనా సుమారు నాలుగు సెంట్లకుపైగా స్థలం కోర్టు ద్వారా సొసైటీకి దక్కటం పట్ల ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. న్యాయవాది రెహమాన్, ప్రజాశక్తి దినపత్రిక కృషితోనే స్థలం భూకబ్జా కాకుండా సొసైటీకి దక్కిందని సంబంధిత అధికారులు వ్యాఖ్యానించారు.

28న అగ్రిగోల్డ్ బాధితుల ధర్నా

ప్రజాశక్తి - భట్టిప్రోలు

అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 28న విజయవాడలోని ధర్నాచౌక్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రేపల్లె ఏరియా కన్వీనర్ గొట్టుముక్కల బాలాజీ తెలిపారు. స్థానికంగా శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు పిలుపు మేరకు నిర్వహిస్తున్న ఈ దీక్షలో బాధితులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. గత వైసిపి ప్రభుత్వం ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వచ్చిన ఆరు మాసాల్లో బాధితులందరికి పూర్తిగా చెల్లిస్తామని హామీ నిచ్చి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి రూ.906కోట్లతో చేతులు దులుపుకుందని ఆరోపించారు. మరణించిన బాధితుల కుటుంబాలకు రూ.10లక్షలు ఎగ్రేషియా ఇస్తామని ఇచ్చిన హామీని మరచిపోయారని అన్నారు. 9.25లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితుల సమస్య పరిష్కరిస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల మానిఫెస్టోలో తెలిపిందన్నారు. కష్టాల్లో ఉన్న అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సమావేశంలో ఎఐటియుసి నాయకులు బండారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కన్వీనర్ బాలాజీ

దుకాణాన్ని తొలగించాలని ఫిర్యాదు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

అంబేద్కర్ విగ్రహం ప్రక్కనే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన దుకాణాన్ని తొలగించాలని కోరుతూ పోలీసు స్టేషన్లో శనివారం ఫిర్యాదు చేశారు. దళిత రాజ్యం వ్యవస్థాపక అధ్యక్షుడు జాలాది ఇస్సాకు (బుజ్జి) ఫిర్యాదును స్టేషన్లో అందజేశారు. ఇస్సాకు మాట్లాడుతూ భవనాన్ని నిర్మించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. గతంలో దళిత రాజ్యం సంఘంలో సభ్యునిగా ఉన్న పేర్లి మోజెస్ ఆ స్థలంలో అక్రమంగా దురాశకు పాల్పడి బడ్డీ కొట్టు ఏర్పాటు చేసుకోవడమే కాకుండా ఆ స్థలంలో గుట్కాలు, సిగరెట్లు, మద్యం తాగే వారికి సౌకర్యవంతమైన పదార్థాలను విక్రయిస్తూ ఆ ప్రాంతాన్ని కలుషితం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మోజేసు ఇటువంటి కార్యకలాపాలు నిర్వహించి ఉండటంతో అతనిని తమ సంఘం నుండి తొలగించినట్లు తెలిపారు. తమ సంఘం నందు ఎటువంటి సభ్యత్వం లేని మోజేసు చేస్తున్న అసాంఘిక కార్యకలాపాల పట్ల తగు చర్యలు తీసుకొని ఆ ప్రాంతంలోని బడ్డీని ఖాళీ చేయించి అంబేద్కర్ గౌరవ ప్రతిష్టకు భంగం వాటిల్ల కుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. దళిత రాజ్యం కమిటీలో నూతన కార్యవర్గ సభ్యుడుగా భట్టిప్రోలు గ్రామానికి చెందిన పిజి అరుణ్‌శాస్త్రిని ఎంపిక చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది దీపాల శివప్రసాద్, యన్నం సురేష్, కంభం సురేష్, పెనుమాక రత్నబాబు, నాగేశ్వరరావు, సందీప్ పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ గ్రామసభలు

ప్రజాశక్తి - రేపల్లె

కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలు శనివారంతో ముగిశాయని తహశీల్దారు శ్రీనివాసరావు తెలిపారు. గతంలో జరిగిన భూముల రీ సర్వేపై వచ్చిన అభ్యంతరాలను ప్రజల నుండి స్వీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మండలంలోని అరవపల్లి గ్రామంలో శనివారం గ్రామ సభ నిర్వహించినట్లు తెలిపారు. ఈనెల 22, 24, 26 తేదీల్లో రీ సర్వే అభ్యంతరాలు స్వీకరించినట్లు తెలిపారు. సర్పంచి లోయ బాబు నాంచారయ్య, మండల సర్వేయర్ బ్రహ్మయ్య, ఆర్ఐ పెదలంక రాంబాబు, ఎన్నికల డిటి నిరంజన్, ఎఒ రమేష్, విఆర్ఒలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నిజాంపట్నం : భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దారు షాకీర్ పాషా అన్నారు. మండలంలోని పల్లపట్లలో రీ సర్వేపై సమస్యల పరిష్కారానికి గ్రామ సభ నిర్వహించారు. రైతుల నుంచి భూ సంబంధిత సమస్యలపై అర్జీలు స్వీకరించారు. భూముల రీ సర్వేలో దొర్లిన తప్పులు, సమస్యలు పరిశీలించి ప్రస్తుతం పరిష్కరించనున్నట్లు తెలిపారు. గ్రామ సభలో 45అర్జీలు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ఓగిబోయిన వెంకట్ యాదవ్, వీఆర్ఓ జ్యోతి, పంచాయతీ కార్యదర్శి ఎండీ జిక్రియా పాల్గొన్నారు.



సంజీవని ఆసుపత్రిలో తనిఖీ చేస్తున్న డిఎంహెచ్ఓ

ఆసుపత్రిలో డిఎంహెచ్ఓ తనిఖీ

ప్రజాశక్తి - చెరుకుపల్లి

ఆసుపత్రిలో మెరుగైన నిర్వహణ చేపడుతూ పేషెంట్లకు తగిన సదుపాయాలు కల్పించాలని డిఎంహెచ్ఓ విజయమ్మ సూచించారు. గుల్లపల్లిలోని సంజీవని మల్టీ స్పెషాలిటీ ట్రామా కేర్ సెంటర్‌ను ఆమె శనివారం తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగుల వివరాలను రికార్డులు తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. ఇన్ పేషెంట్లు అవుట్ పేషంట్ల వివరాలు రికార్డులు నిర్వహించాలని ఆదేశించారు. ఆసుపత్రిలో పారిశుద్ధ్య నిర్వహణ, మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ కమ్మెల హరీష్, బోలగాని శివరామకృష్ణ పాల్గొన్నారు.



వరద బాధితులకు అండగా డిబిఆర్సి దేవకుమార్

వరద బాధితులకు సాయం

ప్రజాశక్తి - కొల్లూరు

గత నెలలో సంభవించిన కృష్ణ నది వరదల వలన ముంపు గురై నష్టపోయిన కొల్లూరు, భట్టిపోలు మండలా ల్లోని 12గ్రామాలకు చెందిన 2వేల కుటుంబాలకు బ్యాంకు ఖాతాల ద్వారా నగదు జమ చేసినట్లు డిబిఆర్సి ఎగ్జిక్యూటివ్ అల్లాడి దేవకుమార్ తెలిపారు. తడికలపూడి గ్రామంలో లబ్ధిదారులతో ఆయన శనివారం మాట్లాడారు. డిబిఆర్సి కో ఆర్డినేటర్ వి భగవాన్ దాస్ అధ్యక్షత వహించారు. వరద కష్టాలు పాలు చేసిందని అన్నారు. వరద సమయంలో డిబిఆర్సి సంస్థ ప్రజలకు ఆహారం, మంచినీరు అందించా రని అన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో తమ సంస్థ పనిచేస్తుందని అన్నారు. క్రిస్టియన్ ఎయిడ్, స్టార్ నెట్వర్క్ తమకు తోడ్పాటు అందించారని తెలిపారు. వేములపల్లి మోహన్ కృష్ణ, రావుల రమేష్, టి కృష్ణమోహన్, సుంకర శ్రీను, తేజ కృష్ణ, మధు, శ్రీలత, ధనరాజ్ పాల్గొన్నారు.



రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న డిఎస్పి శ్రీనివాసరావు

రౌడీ షీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలి

ప్రజాశక్తి - వేమూరు

రౌడీ షీటర్లు సత్ప్రవర్తన కలిగి జీవించాలని రేపల్లె డిఎస్పి ఆవుల శ్రీనివాసరావు సూచించారు. ఎస్పి తుషార్ డూడి ఆదేశాల మేరకు వేమూరు, చుండూరు సర్కిళ్ల పరిధిలోని రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. సత్ప్రవర్తన కలిగి జీవించాలని, వారి నడవడికపైన పోలీసు నిఘా ఉన్నదని హెచ్చరించారు. ఏమైనా కేసుల్లో పాల్గొంటే పిడి యాక్ట్, జిల్లా బహిష్కరణ వుంటుందని హెచ్చరించారు. ఆయన వెంట వేమూరు, చుండూరు సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



మాధవీలతకు శుభాకాంక్షలు చెబుతున్న వైద్యులు

ఆర్‌ఎంఒగా మాధవీలత బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రభుత్వ సర్వజన వైద్యశాల సిఎస్ ఆర్‌ఎంఒగా సివిల్ సర్జన్ డాక్టర్ మాధవీలత శనివారం బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ మాధవీలత ఉమ్మడి ప్రకాశం జిల్లాలో, విభజిత ప్రకాశం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో జిల్లా అదనపు వైద్యాధికారిగా 25 సంవత్సరాలు విశిష్ట సేవలు అందించారు. కోవిడ్ సమయంలో చీరాలలో డాక్టర్ మాధవీలత విశేష సేవలు అందించారని ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ.ఏడు కొండలరావు కొనియాడారు. సిఎస్ఆర్ఎంఒగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ మాధవీలతకు జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జి.దుర్గాదేవి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ బి.తిరుమలరావు, డాక్టర్ బాలాజీనాయక్, వైద్య సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



శంకుస్థాపన చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

నగరంలో 1.30 కోట్లతో కొత్తగా మంజూరై మంగమ్మ కాలేజీ జంక్షన్ వద్ద నుండి కర్నూల్ రోడ్డు ప్లైఓవర్ వద్ద వరకు నిర్మించే తారురోడ్డు శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు, ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.1.30 కోట్లతో తారు రోడ్డు నిర్మాణ పనులు వేగవంతంగా చేపట్టి త్వరలో ప్రారంభిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ శాసనసభ్యులు గల్లా మాధవి, టిడిపి నాయకులు కోలా ప్రభాకర్, పిడిసిసి బ్యాంకు మాజీ ఛైర్మన్ కండె శ్రీనివాసులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మున్సిపాలిటీలో ఇంజనీరింగ్ విభాగంలో అక్రమంగా తొలగించిన 21 మంది కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళన కొనసాగుతోంది. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 13వ రోజుకు చేరుకున్నాయి. శనివారం నాటి దీక్షా శిబిరాన్ని యూనియన్ అధ్యక్షుడు కె.సుబ్బరాయుడు ప్రారంభించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. చట్టవిరుద్ధంగా ఎటువంటి నోటీసు లేకుండా తొలగించడం జరిగిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తొలగించిన కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాలువాది శ్రీనివాసులు, షేక్ షబ్బీర్, షేక్ యూసుఫ్, షేక్ అబ్దుల్, గొట్టం హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి బలోపేతానికి సభ్యత్వ నమోదు

ఎమ్మెల్యే దామచర్ల, ఎంపీ మాగుంట

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

తెలుగుదేశం పార్టీ బలోపేతం, కార్యకర్తల సంక్షేమమే లక్ష్యంగా సభ్యత్వ నమోదు విస్తృతంగా చేపట్టాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. ఒంగోలులోని టిడిపి కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో శనివారం టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభమైంది. ఎంపి మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల లక్ష రూపాయలు కట్టి శాశ్వత పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. దామచర్ల కుమార్తె అనీషా తొలిసారిగా పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపి మాగుంట మాట్లాడుతూ పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షులు ఆదేశాలతో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. సభ్యత్వ నమోదుపై పార్టీ జాతీయ అధ్యక్షులు, సిఎం నారా చంద్రబాబు నాయుడు నేతలకు దిశా నిర్దేశం చేశారన్నారు. రెండు సంవత్సరాలు కాలపరిమితితో ఉండే సభ్యత్వం సుమారు 60 లక్షల వరకు చేయాలని సూచినట్లు తెలియజేశారు. ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ సభ్యత్వ నమోదును రాష్ట్రంలో ఒంగోలును ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. ఒంగోలు నియోజకవర్గంలో గతంలో 48 వేలు సభ్యత్వాలు చేశామని, ప్రస్తుతం 60 వేలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. కార్యక్రమంలో ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, ఎమ్మెల్యే దామచర్ల కుమార్తె అనీషా లక్ష్మి, పార్టీ నాయకులు మంత్రి శ్రీనివాసరావు, టివి శ్రీరామ్మూర్తి, శింగరాజు రాంబాబు, కామేపల్లి శ్రీనివాసరావు, కొఠారి నాగేశ్వరరావు, దాయనేని ధర్మ, బండారు మదన్, తెలుగు మహిళలు రావుల పద్మ, ఆర్ల వెంకటరత్నం, టి.అనంతమ్మ, నాళం నరసమ్మ, కె.కుసుమకుమారి, పసుపులేటి సునీత, యు నాగేంద్రమ్మ, నిడమానూరి పావని, పెద్దిశెట్టి వరలక్ష్మి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అపార్ రూపకల్పనను వేగవంతం చేయండి

అధికారులకు కలెక్టర్ తమీమ్‌అన్సారియా ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ఐడి రూపకల్పన ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. ప్రకాశం భవనంలో ఈ విషయమై శనివారం మండల విద్యాధికారులు, ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు, ఉపాధ్యాయ సంఘాలు, ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాళ్లతో ప్రకాశం భవనంలో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అపార్ ఐడి జనరేషన్ పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అడ్మినిస్ట్రేషన్ రిజిస్టర్, ఆధార్ కార్డు, యుడైస్ లలో విద్యార్థి పేరు, పుట్టిన తేదీ వివరాలు సరిపోలినట్లయితే వారికి వెంటనే అపార్ ఐడి జనరేట్ చేయాలని స్పష్టం చేశారు. ఒకటో తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు సంబంధించిన డేటా మేనేజ్‌మెంట్ కోసం అపార్ ఐడి రూపొందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ విధానాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవటంలో అపార్ ఐడి జనరేట్ ప్రక్రియ అని వేగవంతం చేయాలని అధికారులకు ఆమె దిశా నిర్దేశం చేశారు. యుడైస్ లాగిన్ ఎంఈఓల ఆధ్వర్యంలో ఉందని, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు లాగిన్ ఇస్తే కొంత వెసులుబాటు ఉంటుందని ఈ సందర్భంగా పలువురు



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్‌అన్సారియా

కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అదేవిధంగా విద్యార్థుల పేర్లలో మార్పులు, పుట్టిన తేదీలో తప్పులను సరిచేయడానికి ప్రత్యేకంగా ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ స్పందిస్తూ లాగిన్ విషయమై విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి లేఖ రాస్తానని తెలిపారు. నవంబరు 14వ తేదీన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ విజయవంతంగా నిర్వహించేందుకు ఇప్పటినుంచే పాఠశాలల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి ఏ.కిరణ్ కుమార్, డిప్యూటీ డిఇఒలు సామా సుబ్బారావు, చంద్రమౌళీశ్వరరావు, ఆర్‌ఐఒ సైమన్ విక్టర్, సమగ్ర శిక్ష అభియాన్ ఏఎంఒ రమేష్, డిసిఇబి కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బాలికల వివరాలు సేకరించండి

- బాల్య వివాహాల నివారణకు ప్రత్యేక దృష్టి
- అధికారులకు కలెక్టర్ తమీమ్‌అన్సారియా ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో 12-18 ఏళ్ల బాలికల వివరాలను పకడ్బందీగా సేకరించాలని కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా ఆదేశించారు. బాల్య వివాహాల నివారణపై జిల్లా యంత్రాంగం 'బంగారు బాల్యం' పేరుతో ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. శనివారం ఆయా అంశాలపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో ప్రకాశం భవనంలో ఆమె ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. 3-6 ఏళ్ల చిన్నారులు ఎంత మంది ఉన్నారు, వారిలో ఎంతమంది అంగన్వాడీలలో ఉన్నారు, పాఠశాల వయస్సు పిల్లలు ఎంత మంది ఉన్నారు, వారిలో ఎంతమంది పాఠశాలలో ఉన్నారు, విద్యార్థులకు వ్యాక్సిన్ వేస్తున్న తీరు, రక్తహీనత వంటి అంశాలపై ఆమె సమీక్షించారు. బాల కార్మికులుగా పనిచేసి, విముక్తి పొందిన పిల్లల ప్రస్తుత స్థితిగతులపై కలెక్టర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్యం ప్రతి చిన్నారికి సంతోషమయంగా ఉండేలా జిల్లా యంత్రాంగం ప్రత్యేకదృష్టి పెట్టిందన్నారు. పాఠశాలల నుండి డ్రాపౌట్స్, పోషకాహార లోపం లేకుండా, బాల్య వివాహాలు జరుగకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. వీటికి సంబంధించిన డేటా పకడ్బందీగా నిర్వహించాలని ఆమె పునరుద్ఘాటించారు. తల్లిదండ్రులు లేకుండా బంధువుల వద్ద ఆశ్రయం పొందుతున్న ఆడపిల్లల స్థితిగతులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.మాధురి, ఆర్‌బిఎస్‌కె నోడల్ ఆఫీసర్ డాక్టర్ భగీరధి. కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ గాయత్రి దేవి. జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ పద్మజ, జిల్లా బిసి సంక్షేమ అధికారి అంజల, గిరిజన సంక్షేమ అధికారి జగన్నాధరావు, డిసిపిఒ దినేష్ కుమార్, జిల్లా ఉప విద్యాధికారి సామా సుబ్బారావు, డిఎల్‌పిఒ పద్మ, సిడిపిఒలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కిక్కే కిక్కు..!

కూటమి ప్రభుత్వ పాలనలో మద్యం కిక్కు ఎక్కువగానే ఉంది. ధర తక్కువ.. కిక్కు ఎక్కువన్నట్లుగానే నూతన విధానం కనిపిస్తోంది. మద్యం దుకాణాలు ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు. ఇప్పటికే దుకాణాలు పెట్టేశారు. పలు రకాల మద్యం అమ్మకాలు మొదలుపెట్టారు. తాగే జనం తగ్గలేదు. కొత్త బ్రాండ్లు అంటూ ప్రచారం కూడా సోషల్‌మీడియాలో ఊదర గొడుతున్నారు. అయితే మద్యం ప్రజలకు అందించే తీరులో ఏమైనా మార్పు ఉందా? ప్రజల ఆరోగ్యాలు కాపాడే ప్రక్రియ ఏమైనా కొత్త విధానంలో ఉందా? అంటే ఏమీ లేదు. మద్యం ఏరులై పారుతోంది. ప్రైవేటు వ్యాపారులకు అప్పగించాక ఇష్టారాజ్యమైంది. లైసెన్సుడు దుకాణాల తో పాటు బెల్టుషాపులు విస్తరించాయి. వీటికి పాటలు కూడా పాడుతున్నారు. ఆదాయాలు కూటగట్టుకుంటున్నారు. పాలకపక్ష నేతలెవరూ ఎక్కడా మద్యం విషయంలో సిగ్గుపడేలా లేరు. ఇదేదో నిత్యావసర సరుకు మాదిరిగానే చూస్తు న్నారు. రెండు వారాల్లోనే రూ.75 కోట్ల అమ్మకాలు



జరిగాయని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. గత ప్రభుత్వం పిచ్చి మందు ఇచ్చిందని.. ఇప్పుడు కొత్త కంపెనీల మద్యం ఇస్తున్నామని పాలకపక్ష నేతలు చెప్పడం గమనార్హం. పళ్ల రాలగొట్టకోవడానికి ఏ రాయి ఐతేనేం అన్నట్లుగానే ఆరోగ్యాలు పాడు చేయడానికి ఏ మద్యం అయితేనేం అనే చర్చ మహిళల్లో లేకపోలేదు. ఇప్పటికే అక్కడక్కడా బడి, గుడికి సమీపంలో మద్యం దుకాణాలు వున్నాయంటూ మహిళలు గొడవలకూ దిగుతున్నారు. వాటిని బయట ప్రపంచానికి తెలియకుండానే పాలకపక్షం అణిచివేసే ధోరణి అవలంబిస్తోంది. రోజుకు రూ.ఐదు కోట్ల విలువైన మద్యం తాగుతున్నట్లు గణాంకాలు విదితం చేస్తున్నాయి. అదే రూ.ఐదు కోట్లు పేదలకు ప్రభుత్వం ఇస్తుందా?అంటే ప్రశ్నార్థకమే. నేరుగా ఒక పేదవాడి నుంచి ఎన్ని వేల రూపాయలు మద్యం ద్వారా ప్రభుత్వం లాగుతుందో అందుతో నాలుగో వంతు కూడా సంక్షేమం పేరుతో ఇవ్వడం లేదు. ఇప్పుడు ప్రభుత్వాలు నడిచేదే మద్యం ఆదాయంతోనే అన్న సత్యం సామాన్యుడికే తెలిసిపోయింది. ఈ పరిస్థితిలో మద్యం మరింతగా అమ్మి ఆదాయం పొందడమే ఎజెండాను ప్రభుత్వం తీసుకుంటుందే తప్ప నియంత్రణ చేయడం లేదు. ఇక ఇది పూర్తిగా ప్రైవేటు వ్యాపారంగా మారాక ఎమ్మెల్యేలు కూడా తమ వాటాలు ఏంటని వ్యాపారులను అడుగుతున్నారు. సిండికేట్లను ఏర్పాటుచేశారు. దుకాణాలు దాదాపుగా అన్నీ పాలకపక్ష అనుయాయులకే దక్కాయి. అందరూ దీనిపైనే ఆధారపడినందున ధరలు పెంచి లాభాలు మూటగట్టుకుంటున్నారు. అధిక ధరలకు అమ్ముతున్నారు. మద్యం ఎజెండాగా ఇప్పుడు ప్రభుత్వానికి కీలకంగా మారింది. పేదల ఆరోగ్యాలు గాల్లో కలుస్తున్నాయి.

ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే నష్టపోతామనే భయం పాలకపక్షంలో పెరిగింది. కనీసం ఏదో ఒకటి చేస్తున్నామనే భావన కల్పించాలనే తలంపులో ఉన్నారు. అందుకే మంత్రి గొట్టిపాటి రవికుమార్ క్యాంపు కార్యాలయంలో జిల్లా నేతలు భేటీ అయ్యారు. అక్కడ కొన్ని రాజకీయ ప్రాధాన్యత అంశాలతో పాటు వెలిగొండపైనా చర్చ సాగింది. ఈ నెల 29న ఇరిగేషన్ మంత్రితో పాటు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రాజెక్టు సందర్శన కార్యక్రమం పెట్టుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నిర్వాసితులు తమకు న్యాయం జరుగుతుందని ఆశతో ఉన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లు నిర్వాసితులను గాలికే వదిలేసింది. ఎన్నికలకు ముందు హడావుడిగా ప్రాజెక్టు ప్రారంభోత్సవం చేశారు. పనులతో పాటు పునరావాసం, ప్యాకేజీలు, చెల్లింపులు అన్నీ పెండింగులోనే పెట్టారు. అధికారంలోకి మళ్లీ వచ్చాక ప్యాకేజీలు చెల్లిస్తామని అప్పటి పాలకులు ప్రకటించారు. నిర్వాసితులు ఆగ్రహించారు. ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలను వైసిపి చవిచూసింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం నిర్వాసితుల ఆశలు నెరవేర్చాల్సి ఉంది. ఇందుకు భారీగానే నిధుల అవసరం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం దీన్ని ఇప్పటికిప్పుడు కాకపోయినా రానున్న కాలంలోనైనా అన్ని రకాలుగా అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తిచేయాల్సిన అవసరం ఉంది.

జిల్లాలో కొత్త రాజకీయ చర్చ మొదలైంది. గుంటూరులో మాజీ రాష్ట్రపతి వెంకయ్యనాయుడు మనవడి నిశ్చితార్థం వేడుకల్లో జరిగిన పరిణామాలే ఇందుకు కారణం. సిఎం చంద్రబాబు హాజరైన ఈ కార్యక్రమానికి అక్కడున్న సీనియర్ నేత కరణం బలరాం తటస్థ పడ్డారు. ఇద్దరూ పాత స్నేహితులే కావడంతో పలకరించుకున్నారు. అంతకుముందు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కూడా సీనియర్ నేత కరణం పక్కనే కూర్చుని కాసేపు మాట్లాడుకున్నారు. ఈ ఫొటోలు వైరల్‌గా మారాయి. రాజకీయవర్గాల్లో కొత్త చర్చను లేపాయి. సీనియర్ నేత కరణం బలరాం మళ్లీ తెలుగుదేశంలోకి వస్తారనే ఊహాగానాలు, పుకార్లు తెరపైకి వచ్చాయి. అయితే అక్కడ ఎటువంటి రాజకీయ చర్చ లేకపోయినా రాజకీయవర్గాల్లో తీవ్రమైంది. ఇందుకు కారణం ఎవరి అభిప్రాయాలను వాళ్లు జనంలోకి పెట్టడమే.

దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఏడాదికి మూడు సిలిండర్లకు ప్రభుత్వం డబ్బులు ఇస్తుంది. తాజాగా రేషన్‌కార్డు ఉంటేనే అనే షరతు పెట్టారు. వాస్తవానికి ఎన్నికల మేనిఫెస్టోలో ఈ రేషన్‌కార్డు అన్నది లేదు. దీని వల్ల ఎగువ మధ్య తరగతి కుటుంబాలకు ఈ మూడు సిలిండర్లు లేవని తేలింది. సంపన్నులకు మినహాయింపు వల్ల నష్టం ఏమీలేనప్పటికీ ఏ పథకమైనా ఆచరణలోకి వచ్చే సరికి ఏదోరకంగా జల్లెడ వేయడం జరుగుతోంది. ఇప్పుడూ ఇదే జరిగిందని గుర్తించాలి.

పాలకపక్ష ఎమ్మెల్యేలు నియోజకవర్గ కేంద్రాల్లో ప్రజాదర్బార్‌లు పెడుతున్నారు. ప్రజల నుంచి అర్జీలు తీసుకుని అధికారుల సమక్షంలో వాటిని పరిష్కారం దిశగా చర్యలు చేపట్టారు. పేదలకు ఎక్కడికక్కడ సమస్యలు పరిష్కారమైతే కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం తీరుతుంది.